

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 340 | హైదరాబాద్ | సోమవారం | 18-05-2026 | పేజీలు: 08




## అనుమతులు లేకుండానే నల్లమట్టి తరలింపులు..

ప్రభుత్వ అనుమతులు లేకుండానే చెరువులో భారీగా నల్లమట్టి తవ్వకాలు

జేసీబీలు, టిప్పర్లతో ఇటుక బట్టీలకు అక్రమ మట్టి తరలింపు

పట్టపగలే సాగుతున్న దందాపై గ్రామస్థుల ఆగ్రహం

"ఆదివారం కూడా అనుమతులుంటాయి" అన్న ఇరిగేషన్ అధికారుల వ్యాఖ్యలపై విమర్శలు

మట్టి మాఫియాకు స్థానిక నాయకుల అండ ఉందని గ్రామస్థుల ఆరోపణలు

ప్రశ్నించిన రైతులపై దౌర్జన్యానికి దిగుతున్న మాఫియా సభ్యులు

నాలుగు రోజులుగా కొనసాగుతున్న అక్రమ మట్టి రవాణాపై అధికారుల నిర్లక్ష్యం

చెరువు పరిరక్షణపై గ్రామ ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

నల్లమట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే చెరువులో భారీ ఎత్తున మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ, అక్రమంగా ఇతర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఆదివారం పట్టపగలే జేసీబీలు, టిప్పర్ల సహాయంతో మట్టిని తరలిస్తుండటాన్ని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ మట్టి తరలింపు పై సంబంధిత ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించగా, ఆదివారం కూడా నల్లమట్టి, ఇసుక తరలింపులకు అనుమతులు ఇస్తామని ఇరిగేషన్ శాఖ ఈఈ చెప్పడం విడ్డూరంగా మారింది. గత కొన్ని రోజులుగా పదుల సంఖ్యలో టిప్పర్లు మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో మట్టిని ఎలా తరలిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తుంటే, మట్టి మాఫియా సభ్యులు వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని ఆరోపణలు ..మిగతా 2లో

## చాయ్ గరం.. బిర్యానీ పిరం..



హైదరాబాదీలకు వంటగ్యాస్ షాక్

వాణిజ్య సిలిండర్ ధర 50 శాతం పెంపు ప్రభావం

రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో పెరిగిన రేట్లు

ఆహారం ధరల్లో 20 నుంచి 40 శాతం వరకు పెరుగుదల

రోజుకు సగటున రూ.40 నుంచి రూ.60 వరకు అదనపు ఖర్చు

మొత్తంగా రోజుకు రూ.20 కోట్లకు పైనే అదనపు భారం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ అనగానే ఎవరికైనా గుర్తొచ్చే దమ్ బిర్యానీ, ఇరానీ చాయ్ మొదలు అన్నిరకాల ఆహార పదార్థాలపై గ్యాస్ ధర పెంపు ప్రభావం పడింది. మొన్నటి వరకు రూ.220 నుంచి రూ.300 వరకు ఉన్న ప్లేట్ చికెన్, మటన్ బిర్యానీ ధర ఇప్పుడు రూ.270 నుంచి రూ.380కి చేరింది. పాతబస్తీలోని ఒక ప్రముఖ ..మిగతా 2లో



## బండి భగీరథ్ అరెస్ట్.. కేంద్రానికి సంబంధం లేదు

పోక్సో కేసులో బండి భగీరథ్ అరెస్ట్

ఇప్పటికే సరెండర్ అయ్యాడన్న కిషన్ రెడ్డి

ఇక చర్చించాల్సిన అవసరం లేదని వెల్లడి

రాష్ట్ర పోలీసులే చూసుకుంటారని స్పష్టీకరణ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ కావడంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పందించారు. భగీరథ్ ఇప్పటికే సరెండర్ అయ్యాడని ..మిగతా 2లో

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందే..

బాలిక కేసులో కేంద్రంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

బాధితురాలికి న్యాయం కోసం పోరాడింది బీఆర్ఎస్ మాత్రమేనని వ్యాఖ్య

కాంగ్రెస్, బీజేపీ కలిసి కేసును నీరుగార్చే ప్రయత్నమన్న ఆరోపణ

బండి సంజయ్ పదవిలో ఉంటే విచారణ సక్రమంగా జరగదన్న కేటీఆర్

కేంద్రమంత్రి కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసులపై ఆగ్రహం

బాధితురాలి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేశారన్న ఆరోపణ

'బేటీ బచావో' నినాదాలు మాటలకే పరిమితమయ్యాయని విమర్శ

ఎల్బీనగర్‌లో 'నా బూత్- నా భవిష్యత్తు' కార్యక్రమంలో వ్యాఖ్యలు

బీఆర్ఎస్ పోరాటంతోనే కేసులో పురోగతి వచ్చిందన్న కేటీఆర్

ఇలాంటి వ్యక్తులు పదవుల్లో ఉండటం దేశానికే అవమానమని ఫైర్



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఎల్బీనగర్ నియోజకవర్గంలో 'నా బూత్ నా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ బీఎల్ఏలకు ..మిగతా 2లో



## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం..!

యూనిట్-3లో ఒక్కసారిగా ఎగిసిపడ్డ మంటలు

షార్ట్ సర్క్యూట్, ఆయిల్ లీకేజీపై అనుమానాలు

అప్రమత్తమైన సిబ్బంది.. తప్పిన భారీ ప్రమాదం

వరుస ఘటనలతో భద్రతపై ప్రశ్నలు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

నల్గొండ జిల్లా వీర్లపాలెంలోని ప్రతిష్టాత్మక యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్ 3 పరిధిలో ఉన్న టర్బైన్ డ్రైవన్ బాయిలర్ ఫీడ్ పంప్ (BFB) ఏరియాలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో పాటు అక్కడ ఆయిల్ లీకేజీ కావడంతో మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన ప్లాంట్ అధికారులు, సాంకేతిక సిబ్బంది , అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రతిపాదికన స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో ఒక పెద్ద పెను ప్రమాదం తప్పింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు, ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఈ అగ్నిప్రమాదం కారణంగా ప్లాంట్‌లోని కంట్రోల్ కేబుల్స్‌తో పాటు వాల్స్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. అయితే, ఈ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదాలు జరగడం ఇది మొదటిసారి కాదు. గత ఏడాది మే నెలలో కూడా ఇక్కడి యూనిట్ 1లో ఇలాగే అగ్నిప్రమాదం ..మిగతా 2లో

## తెలంగాణను వణికిస్తున్న భానుడి భగభగలు

రాబోయే 5 రోజులు అత్యంత కీలకం

వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' హెచ్చరికలు

ఐదు జిల్లాల్లో తీవ్ర స్థాయిలో ఎండలు

అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ..మిగతా 2లో

## డచ్ ప్రధాని ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

మాది 140 కోట్ల మంది ఆశల 'సజీవ ప్రజాస్వామ్యం'

నెదర్లాండ్స్ పీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన విదేశాంగ శాఖ

పత్రికా స్వేచ్ఛ, మైనారిటీలపై ఆరోపణలు ముమ్మాటికీ తప్పని వెల్లడి

డచ్ ప్రధానికి అవగాహన లోపమన్న కార్యదర్శి సిబి జార్జ్

5 వేల ఏళ్ల పురాతన నాగరికత, వైవిధ్యాన్ని అర్థం చేసుకోవాలని సూచన

ఐరోపా కంటే ముందే భారత్‌కు వచ్చిన క్రైస్తవం

శతాబ్దాలుగా ఇస్లాం, జైన, బౌద్ధ, సిక్కు మతాలు ఉన్నాయని వెల్లడి

వేధింపులు లేని దేశంగా యూదులకు ఆశ్రయం

ప్రపంచంలోనే మరే దేశంలోనూ లేని మత సామరస్యం భారత్ సొంతమని వివరణ

ప్రజాస్వామ్య మార్గంలోనే పేదరిక నిర్మూలన

ఎలాంటి హింసకు తావులేకుండా ఆర్థికంగా అద్భుత ప్రగతి సాధిస్తున్నట్లు వెల్లడి



**నేషనల్‌బ్యూరో, (ప్రజాక్షేత్రం):**

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ క్షీణిస్తోందని, మతపరమైన మైనారిటీల హక్కులు హరించుకుపోతున్నాయంటూ నెదర్లాండ్స్ (డచ్) ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ చేసిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. భారత్ తన దేశ పౌరులందరికీ సంపూర్ణ వాక్ ..మిగతా 2లో

# అనుమతులు లేకుండానే నల్లమట్టి తరలింపులు..

మొదటిపేజీ తరువాయి

ఉన్నాయి. స్థానిక నాయకుల అండదండలతోనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. గత నాలుగు రోజులుగా కర్నే గ్రామ రైతులు తమ పొలాలకు నల్లమట్టి తరలిస్తుండగా, ఆదివారం అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల అండతో ఎలాంటి పర్మిషన్ లేకుండానే చెరువులో నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**కర్నే చెరువులో**
**రెచ్చిపోతున్న మట్టి మాఫియా**

కర్నే చెరువులో మట్టి మాఫియా నిబంధనలను తుంగలో తొక్కి వ్యవహరిస్తోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండానే చెరువులో నల్లమట్టిని భారీ యంత్రాలతో తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కళ్లముందే ఈ అక్రమ దందా సాగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతుల్లేవు.. అడ్డూ అదుపూ లేదు!**

సాధారణంగా నల్లమట్టి తవ్వకాలకు మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరి. కానీ కర్నే చెరువులో తవ్వకాలు నిర్వహిస్తున్న వారు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం. రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్లు నిరంతరాయంగా మట్టిని తరలిస్తూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ప్రధానంగా చెరువు పరివాహక ప్రాంతాల్లో మట్టిని తోడేస్తుండటంతో భూగర్భ జలమట్టం పడిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

**పాలకుల అండ.. అధికారుల దండ!**

ఈ అక్రమ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి అండదండలతోనే మాఫియా ఇంత ధైర్యంగా తవ్వకాలు జరుపుతోందని గ్రామస్థులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయి అధికారులు స్పందించకపోవడం వెనుక 'మామూళ్ల' వ్యవహారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**దెబ్బతింటున్న పొలాలు, రహదారులు**

భారీ వాహనాల రాకపోకల వల్ల గ్రామీణ రహదారులు ఛిద్రమవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి, అనుమతులు లేకుండా నల్లమట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా నల్లమట్టి తరలించే మాఫియాపై గ్రామాల వారీగా తిరగబడాల్సిన పరిస్థితి వస్తోందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా దానికి పోలీసు శాఖే బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతులు, ప్రజలు, స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు.

# చాయ్ గరం.. బిర్యానీ పిరం..

మొదటిపేజీ తరువాయి

హోటల్‌లో మటన్ బిర్యానీ ప్లేట్ రూ.320 నుంచి ప్రస్తుతం రూ.360కి పెరిగింది. గచ్చిబౌలిలోని ఒక హోటల్లో మొన్నటివరకు రూ.340 ఉండగా రూ.380కు, ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఒక ప్రముఖ రెస్టారెంట్ లో రూ. 320 నుంచి 360 పెరిగింది. ఇక నగర ప్రజలు ఇష్టంగా తాగే ఇరానీ చాయ్ రూ.12 నుంచి రూ.20కి ఎగబాకింది.

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో చమురు సంక్షోభం గ్యాస్ దిగుమతులపై ప్రభావం చూపించడం, వాణిజ్య సిలిండర్ ధర గణనీయంగా పెరగడంతో ఫుడ్ ఇండస్ట్రీపై పిడుగు పడినట్టయ్యింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో టీ స్టాళ్లు మొదలుకుని కర్రీ పాయింట్లు, టిఫిన్ బండ్లు, చిన్న హోటళ్లు, స్టార్ హోటళ్ల వరకు అన్నిట్లోనూ ఆహార పదార్థాల ధరలు పెరిగాయి. ఎక్కడ చూసినా 'ధరలు పెంచాం - సహకరించండి'అనే బోర్డులు కనిపిస్తున్నాయి. టీ నుంచి బిర్యానీ వరకు అన్నింటిపైనా సగటున 20% నుంచి 40% వరకు అదనంగా ధరలు పెరిగాయి. నగరంలోని ప్రతి నలుగురిలో ఒకరు బయటి ఆహారంపైనే ఆధారపడుతున్నారనే అంచనాల నేపథ్యంలో పెరిగిన ధరలు వారికి భారంగా మారాయి.

**30 శాతం జనానికి హోటలే దిక్కు!**

నగర జనాభా 1.55 కోట్లు దాటింది. అందులో సుమారు 30 శాతం అంటే సుమారు 46.50 లక్షల మంది నిత్యం బయటి ఆహారంపైనే ఆధారపడి ఉంటారన్నది అంచనా. కాగా తాజా గ్యాస్ ధర ప్రభావంతో ఆహార ప్రియులపై రోజుకు సగటున రూ.40 నుంచి రూ.60 అదనపు భారం పడుతోంది. ఈ లెక్కన నగరంపై రోజుకు సగటున రూ.20 కోట్ల వరకు అదనపు భారం పడుతుండగా, నెలకు రూ.600 కోట్లు దాటిపోతోంది. ఇంట్లో వంట సదుపాయం ఉన్నప్పటికీ టీ, టిఫిన్లు, భోజనాల కోసం 20.25 లక్షల మంది హోటళ్లకు వెళుతుంటారని అంచనా. మిగిలిన 26.25 లక్షల మంది విద్య, శిక్షణ, ఉపాధి, వైద్యం, ఇతరత్రా పనుల కోసం నగరానికి వచ్చి హాస్టళ్లు, అద్దె రూమ్‌లు, లాడ్జీల్లో ఉంటూ అనివార్యంగా బయటి భోజనంపైనే ఆధారపడుతుంటారు. నలుగురితో కూడిన ఒక కుటుంబం హోటల్‌కు వెళ్లి భోజనం చేసి రావాలంటే రూ. 500 నుంచి రూ.1,000 వరకు అదనంగా బిల్లు అవుతున్నట్టు తెలుస్తోంది.

**కడుపు నింపని భోజనం!**

నగరంలోని అమీర్‌పేట్, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ మాదాపూర్ వంటి ప్రాంతాల్లో ఉండే విద్యార్థులు, నిరుద్యోగులు ఐటీ ఉద్యోగులు నూటికి నూరు శాతం మెస్‌లు, కర్రీ పాయింట్లపైనే ఆధారపడుతుంటారు. ప్రస్తుతం వీరి నెలవారీ మెస్ చార్జీలు కూడా పెరిగాయి. గ్యాస్ ధర పెంపుతో అమాంతం ధరలు పెంచిన మెస్‌లు.. మెనూ మాత్రం తగ్గించేశాయి. పప్పులో పప్పు ఉండటం లేదని, చారులో రుచి కరువయ్యిందని, పరిమాణం తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక హోటళ్లలో కూడా మొన్నటివరకు ఇద్దరికి సరిపోయే 'ఫుల్ బిర్యానీ'ఇప్పుడు ఒకరికి కొంచెం ఎక్కువ, ఇద్దరికి తక్కువ అన్నట్లుగా మారిపోయిందని అంటున్నారు.

**కర్రీ..వర్రీ**

నగరంలో కర్రీ పాయింట్లకు యమ గిరాకీ అన్న సంగతి తెలిసిందే. కీలక ప్రాంతాల్లో గల్లీకో కర్రీ పాయింట్ ఉంటోంది. ప్రస్తుతం నాన్ వెజ్, వెజ్..అన్నిరకాల కూరల ధరలూ పెరిగాయి. ప్రతి కర్రీపై రూ.10 నుంచి రూ. 20 వరకు పెరుగుదల చోటు చేసుకుంది. కర్రీ పాయింట్లలో ఒక కప్పు కూర ధర రూ. 30 నుంచి రూ. 50కి చేరడంతో, రెండు కూరలు కొనేవారు ఇప్పుడు ఒక్కదాంతోనే సర్దుకుపోతున్నారు. క్యాటరింగ్ రంగానిదీ ఇదే పరిస్థితి. కొత్తగా వచ్చే ఆర్డర్లపై ప్లేటుకు రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

**వసతి భారం**

హాస్టళ్లపై వాణిజ్య గ్యాస్ ధరల పెరుగుదల తీవ్ర ప్రభావం చూపుతోంది. సుమారు 12 వేల హాస్టళ్లలో ఉంటున్న 11 లక్షల మంది విద్యార్థులు, ఉద్యోగులు దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత, అధిక ధరలతో పాటు నిత్యావసరాల ధరలు కూడా పెరగడంతో హాస్టళ్ల నిర్వాహకులు భారీ నష్టాల్లో కూరుకుపోయారు. ఈ అదనపు భారాన్ని తట్టుకోలేక ఫీజులు పెంచడంతో పాటు మెనూలో కొంత కోతలు పెడుతున్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం..!

మొదటిపేజీ తరువాయి

చోటుచేసుకుంది. మరీ ముఖ్యంగా, ఈ యూనిట్ 3లో కొద్ది రోజుల క్రితమే అనధికారికంగా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే మళ్లీ ఇలాంటి ప్రమాదం జరగడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అధికారులు మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో దట్టంగా అలుముకున్న పొగలు క్లియర్ అయిన తర్వాత, క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను విశ్లేషించి ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక సమర్పించనున్నారు.





# డచ్ ప్రధాని ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్యాన్ని, సమాన హక్కులను కల్పించిన ఒక గొప్ప 'సజీవ ప్రజాస్వామ్య దేశం' అని గట్టిగా స్పష్టం చేసింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెదర్లాండ్స్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకున్న తరుణంలో ఈ వివాదం రేగింది. పర్యటన వివరాలను అంతర్జాతీయ మీడియాతో పంచుకునే సమయంలో డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ భారత్‌లో భావప్రకటనా స్వేచ్ఛ తగ్గుతోందంటూ విమర్శలు గుప్పించారు. దీనిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) కార్యదర్శి (వెస్ట్) సిబి జార్జ్ వెంటనే స్పందిస్తూ డచ్ ప్రధానికి ఘాటుగా, హేతుబద్ధంగా సమాధానం ఇచ్చారు.

అవగాహన లోపంతోనే ఆరోపణలు: సిబి జార్జ్ డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్ చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ పూర్తిగా తోసిపుచ్చింది. విదేశాంగ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ మాట్లాడుతూ, "భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ, ఇక్కడి మైనారిటీల హక్కుల రక్షణ గురించి డచ్ ప్రధానమంత్రికి సరైన అవగాహన లేదని స్పష్టమవుతోంది. ఆయనకు ఉన్న అవగాహన లోపం వల్లే మేము ఈ రోజు అంతర్జాతీయ వేదికపై ఈ ప్రశ్నను ఎదుర్కోవాల్సి వచ్చింది. భారతదేశం అంటే చిన్న దేశం కాదు, అది 1.4 బిలియన్ల (140 కోట్లు) జనాభా కలిగిన దేశం. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మాది. అంతేకాదు, ఇది 5 వేల సంవత్సరాల సుదీర్ఘ, పురాతన నాగరికత కలిగిన గొప్ప దేశం" అని డచ్ ప్రధాని వ్యాఖ్యలను తిప్పికొట్టారు.

**భారతదేశంలో వర్ధిల్లుతున్న మత స్వేచ్ఛ**

భారతదేశంలోని విశిష్టమైన సాంస్కృతిక, మత, భాషా పరమైన వైవిధ్యాన్ని సిబి జార్జ్ ఈ సందర్భంగా అంతర్జాతీయ సమాజం ముందు ప్రముఖ్యంగా ప్రస్తావించారు. "మీరు ఒక్కసారి భారతదేశాన్ని నిశితంగా పరిశీలిస్తే, ఆ దేశం ఎంత అందంగా, వైవిధ్యంగా ఉంటుందో అర్థమవుతుంది. ప్రపంచంలో మరే ఇతర దేశంలోనూ ఇన్ని ప్రధాన మతాలు పుట్టలేదు. హిందూ మతంతో పాటు బౌద్ధ, జైన, సిక్కు మతాలు ఈ పవిత్ర భూమిపైనే జన్మించి, శతాబ్దాలుగా ఇక్కడే వర్ధిల్లుతున్నాయి. కేవలం ఇక్కడ పుట్టిన మతాలే కాకుండా, ప్రపంచంలోని దాదాపు అన్ని ప్రధాన మతాల ప్రజలు భారతదేశంలో ఆశ్రయం పొందారు. వారంతా ఇక్కడ ఎలాంటి వివక్ష లేకుండా నిరంతరం అభివృద్ధి చెందుతున్నారు" అని వివరించారు.

**ఐరోపా కంటే ముందే క్రైస్తవం వచ్చింది!**

ప్రపంచవ్యాప్తంగా యూదులు ఎన్నో దేశాల్లో వేధింపులకు గురయ్యారని, కానీ వారు ఎటువంటి వేధింపులు ఎదుర్కోకుండా అత్యంత గౌరవంగా జీవించిన అతికొద్ది దేశాల్లో భారతదేశం మొదటి వరుసలో ఉంటుందని సిబి జార్జ్ గుర్తుచేశారు. ఇది ఈ దేశ సంస్కృతికి ఉన్న గొప్ప గుణమని కొనియాడారు. "యేసు క్రీస్తు పునరుత్థానం జరిగిన వెంటనే క్రైస్తవ మతం భారతదేశానికి చేరుకుంది. నిజం చెప్పాలంటే, ఐరోపా ఖండంలో క్రైస్తవ మతం విస్తరించడం కంటే ముందే అది భారతదేశానికి వ్యాపించింది. ఇక్కడ క్రైస్తవం నాటి నుంచి నేటి వరకు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంది. ఈ రోజు భారతదేశంలో 30 మిలియన్ల (3 కోట్లు) కంటే ఎక్కువ మంది క్రైస్తవ సోదరులు ఉన్నారు. అలాగే, మొహమ్మద్ ప్రవక్త కాలంలోనే ఇస్లాం మతం కూడా ఇండియాకు వచ్చింది. నాటి నుంచి నేటి వరకు ఇస్లాం ఇక్కడ ఎంతో గౌరవంగా వర్ధిల్లుతోంది" అని ఆయన పేర్కొన్నారు.



**ప్రజాస్వామ్యయుతంగా**
**అధికార బదిలీ, ఆర్థిక విజయం**

భారతదేశం కేవలం పేరుకు మాత్రమే కాకుండా ఆచరణలో ఒక సజీవ ప్రజాస్వామ్యంగా కొనసాగుతోందని చెప్పడానికి ఇటీవల దేశంలో జరిగిన సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల ఉదాహరణలను సిబి జార్జ్ ప్రస్తావించారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా అత్యంత శాంతియుతంగా, పారదర్శకంగా అధికార బదిలీ జరుగుతుందని చెప్పారు. "ప్రజాస్వామ్య సూత్రాలు, మానవ హక్కులతో ఎలాంటి రాజీపడకుండానే భారతదేశం ఈ రోజు ప్రపంచంలోనే అద్భుతమైన ఆర్థిక విజయాన్ని సాధిస్తోంది. అనేక దేశాలు పేదరికాన్ని నిర్మూలించడానికి హింసను, కఠిన చట్టాలను ఆశ్రయించాయి. కానీ మేము పూర్తి ప్రజాస్వామ్య ప్రక్రియల ద్వారా, ప్రజల భాగస్వామ్యంతోనే దేశంలో పేదరికాన్ని విజయవంతంగా నిర్మూలిస్తున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

**పెరిగిన మైనారిటీల జనాభానే ఒక నిదర్శనం**

ప్రపంచ జనాభాలో ఆరో వంతు జనాభా ఒక్క భారతదేశంలోనే ఉందని, కానీ ప్రపంచంలో ఉన్న సమస్యల్లో ఆరో వంతు సమస్యలు కూడా మా దేశంలో లేవని సిబి జార్జ్ అన్నారు. ఇదే భారతదేశానికి ఉన్న అసలైన అందమని, ఇది ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేస్తుందని చెప్పారు. దేశంలో ప్రతి మైనారిటీ వర్గం ఎంతో సంతోషంగా, సురక్షితంగా వృద్ధి చెందుతోందని చెప్పారు. దీనికి గణాంకాలే ప్రత్యక్ష నిదర్శనమని చెబుతూ.. "భారతదేశానికి స్వాతంత్ర్య వచ్చిన సమయంలో దేశంలో మైనారిటీల జనాభా కేవలం 11 శాతంగా ఉండేది. కానీ నేడు అన్ని రంగాల్లో వారికి లభిస్తున్న సమాన అవకాశాల వల్ల అది 20 శాతం కంటే ఎక్కువైంది. అయినప్పటికీ భారత్‌లోని అన్ని మతాల ప్రజలు ఎలాంటి గొడవలు లేకుండా అన్నదమ్ముల్లా, ఎంతో సంతోషంగా జీవిస్తున్నారు" అని డచ్ ప్రధాని ఆరోపణల్లోని నిజానిజాలను ఎండగట్టారు.

**అయినప్పటికీ బలపడిన**
**భారత్-నెదర్లాండ్స్ బంధం**

డచ్ ప్రధాని అంతర్గత విషయాలపై కొన్ని విమర్శలు చేసినప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనతో భారత్, నెదర్లాండ్స్ మధ్య ద్వైపాక్షిక, దౌత్య సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. శనివారం నాడు ప్రధాని మోదీ, డచ్ ప్రధాని రాబ్ జెట్టెన్‌ల మధ్య జరిగిన ప్రతినిధి స్థాయి చర్చలు అత్యంత ఆశాజనకంగా సాగాయి. ఇరు దేశాలు తమ బంధాన్ని 'వ్యూహాత్మక భాగస్వామ్యంస స్థాయికి తీసుకెళ్లాలని కీలక నిర్ణయం తీసుకున్నాయి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆవిష్కరణలు (ఇన్నోవేషన్), పరస్పర పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధి, రక్షణ రంగం, సెమీకండక్టర్ల పరిశ్రమ, డిజిటల్ టెక్నాలజీ తదితర కీలక రంగాలలో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు ఒకరికొకరు అంగీకారం తెలుపుకున్నారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య వాణిజ్యానికి సరికొత్త మార్గాలను సుగమం చేసిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బర్తరఫ్ చేయాల్సిందే..

మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు.

ఒక బాలికకు అన్యాయం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆ ఘటనను నీరుగార్చే ప్రయత్నం చేశాయని ఆరోపించారు. అయితే బాధిత బాలికకు న్యాయం జరగాలని నిలబడి పోరాడింది మాత్రం బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తో పాటు అనుబంధ సంఘాలు చేపట్టిన ఉద్యమాల వల్లే కేసులో కొంతమేర పురోగతి కనిపించిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని కేటీఆర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటూ నినాదాలు ఇస్తున్నారని, కానీ అవి కేవలం మాటలకే పరిమితమైతే బాలికలకు న్యాయం జరగదని విమర్శించారు. కేంద్రమంత్రి కుమారుడిపై లుక్‌ఔట్ నోటీసులు జారీ అయ్యే పరిస్థితి రావడం దేశానికి అవమానకరమని వ్యాఖ్యానించారు.

బండి సంజయ్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించకపోతే విచారణ నిష్పక్షపాతంగా సాగదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన వ్యక్తిని తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టడమే కాకుండా బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేసిందీ కేంద్ర మంత్రేనని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులు కీలక పదవుల్లో కొనసాగడం తెలంగాణకే కాదు దేశానికే అవమానమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.



# బండి భగీరథ్ అరెస్ట్.. కేంద్రానికి సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి

గుర్తుచేశారు. ఇక దానిపై చర్చించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని వివరించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

**ప్రతిపైసా కేంద్రానిదే**

మరోవైపు ధాన్యం సేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రతిపైసా కేంద్రమే ఇస్తోందని వెల్లడించారు. అయినా రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సన్న వడ్లకు రాష్ట్రం బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని.. వారికి రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. మంత్రులు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

# తెలంగాణను వణికిస్తున్న భానుడి భగభగలు

ఉండాలని వాతావరణ శాఖ (IMD) హెచ్చరించింది. భానుడి ఉగ్రరూపానికి తోడు తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా ఐదు జిల్లాల్లో ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో ఉండబోతోందని వాతావరణ కేంద్రం ప్రత్యేక అలర్ట్ జారీ చేసింది.

**ఐదు జిల్లాలకు 'రెడ్ అలర్ట్'..**
**45 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత సరికొత్త రికార్డులను నమోదు చేసే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండ తీవ్రత మరియు వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉండే ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' ప్రకటించింది. రేపటి నుండి నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కూడా పరిస్థితి తీవ్రంగా మారనుందని, ఇక్కడ పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో ఎండల తీవ్రత సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉండబోతోంది. ఇవాళ మరియు సోమవారం నాడు రాష్ట్రంలోని దాదాపు 16 నుండి 20 జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. ఈమేరకు హైదరాబాద్, మేడ్చల్‌మాల్కాజిగిరి, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, జనగామ, యాదాద్రిభువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ఒకవైపు ఎండలు మండుతుండగానే, మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన గాలి విచ్ఛిన్నతి కారణంగా రాష్ట్రంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీని ప్రభావంతో ఇవాళ పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్ నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రాకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ అనివార్య కారణాల వల్ల ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే, తప్పనిసరిగా టోపీ ధరించడం లేదా తెల్లటి టవల్‌ను తలకు కట్టుకోవడం చేయాలి. ముక్కు, చెవుల ద్వారా వేడి గాలి (వడగాలి) శరీరంలోకి ప్రవేశించకుండా ముఖానికి కర్చీఫ్ కట్టుకోవాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అలాగే శరీరానికి గాలి తగిలేలా ఉండే తేలికపాటి నూలు (కాటన్) వస్త్రాలను ధరించడం ఉత్తమం.

ఈ వాతావరణ పరిస్థితులు అందరిపై ప్రభావం చూపినప్పటికీ, కొందరికి వడదెబ్బ తగిలే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుంది. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో (గుండె జబ్బులు, మధుమేహం వంటివి) సతమతమవుతున్న వారు మధ్యాహ్నం వేళల్లో అస్సలు బయటకు రాకూడదు. ఇంట్లోనే ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఏమాత్రం అస్వస్థతగా అనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో రేకుల ఇళ్లలో నివసించే వారికి ఎండ వేడిమి నేరుగా తాకుతుంది. వేడి గాలులు ఇళ్లలోకి రావడం వల్ల గది ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతుంది. ఇలాంటి ఇళ్లలో ఉండేవారు వేడిని తగ్గించుకోవడానికి ఇంటి రేకులపై ఎండుగడ్డిని లేదా జనపనార (గోనె) సంచులను పరిచి, వాటిపై క్రమం తప్పకుండా నీళ్లు చల్లుతూ తడపాలి. దీనివల్ల ఇళ్లలోకి వచ్చే వేడి తీవ్రతను కొంతవరకు తగ్గించుకోవచ్చు.

అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరానికి విపరీతంగా చెమట పడుతుంది. దీనివల్ల శరీరంలోని నీటి శాతంతో పాటు అత్యంత కీలకమైన ఎలక్ట్రోలైట్స్ (లవణాలు) హరించుకుపోతాయి. ఫలితంగా తీవ్రమైన అలసట, నీరసం మరియు అస్వస్థత కలుగుతాయి. కాబట్టి దాహం వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీరు తాగుతూ ఉండాలి. సాధారణ నీటితో పాటు కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, లేదా నిమ్మరసంలో కొద్దిగా ఉప్పు, చక్కెర కలిపి తీసుకోవడం ద్వారా శరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఎవరైనా ఎండ తీవ్రతకు గురై సొమ్మసిల్లిపోతే (వడదెబ్బ తగిలితే) వెంటనే వారిని నీడగా ఉన్న చల్లని ప్రదేశానికి తరలించాలి. బాధితుడి తల నుండి కాళ్ల వరకు తడి గుడ్డతో పూర్తిగా తుడుస్తూ శరీరాన్ని చల్లబరచాలి. గదిలో గాలి ధారాళంగా ఆడేలా చూడాలి. బాధితుడు కాస్త తేరుకున్న తర్వాత ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించి, వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. ముఖ్యంగా వడదెబ్బతో పాటు వాంతులు, విరేచనాల లక్షణాలు ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్యం అందించాలని డాక్టర్లు సూచిస్తున్నారు.



## ఎయిడ్స్ బాధితుల స్మరణలో క్యాండిల్ లైట్ ర్యాలీ

**మల్కాజిగిరి,మే 17(ప్రజా క్షేత్రం):**

హెచ్ఐవీ/ఎయిడ్స్ కారణంగా మృతిచెందిన వారిని స్మరించుకుంటూ మేడ్చల్‌మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ప్రత్యేక అవగాహన ర్యాలీ చేపట్టారు. హెచ్ఐవీ బాధితులపై సమాజంలో ఉన్న వివక్షను తొలగించి, ప్రజల్లో అవగాహన పెంపొందించడమే కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. హెచ్ఐవీ నివారణకు సమయానుకూల పరీక్షలు, చికిత్స ఎంతో అవసరమని ఆరోగ్య అధికారులు వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సంపూర్ణ సురక్ష కేంద్రం (ఎస్ఎస్‌కే) సిబ్బంది, శ్రీ సాయి మహిళా సంగంఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి ఎయిడ్స్ మృతులకు నివాళులర్పించారు.




## తాగి వాహనం నడిపితే కఠిన చర్యలే !

- మల్కాజిగిరిలో 323 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

**దమ్మాయిగూడ, మే 17(ప్రజా క్షేత్రం):**

మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వీకెండ్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 323 మంది వాహనదారులు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో 267 ద్విచక్ర వాహనదారులు, 22 ఆటో డ్రైవర్లు, 33 కార్ డ్రైవర్లు, ఒక భారీ వాహన డ్రైవర్ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అతిగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు హెచ్చరించారు.




## ఆలయాల ఆదాయాల్లో వేములవాడ రాజన్నకు రెండో ర్యాంక్

- కొండగట్టు అంజన్న టాప్-4లో చోటు

**కరీంనగర్/ వేములవాడ, మే 17(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల వార్షిక ఆదాయ వివరాలను దేవాదాయ శాఖ తాజాగా ప్రకటించింది. 202526 ఆర్థిక సంవత్సరంలో దర్శన టికెట్లు, ప్రత్యేక పూజలు, హుండీ ఆదాయం ద్వారా ప్రముఖ ఆలయాలు భారీ ఆదాయాన్ని నమోదు చేశాయి. భక్తుల రద్దీ పెరగడం, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడం వల్ల దేవాలయాల ఆదాయం గణనీయంగా పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. రూ.93.87 కోట్ల ఆదాయంతో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. నిత్య దర్శనాలతో పాటు ప్రత్యేక సేవలకు భక్తుల నుంచి విశేష స్పందన రావడంతో యాదాద్రి ఆదాయం మరింత పెరిగినట్లు తెలుస్తోంది.

**రాజన్న సన్నిధికి భక్తుల వెల్లువ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రసిద్ధ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం రూ.73.43 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో రెండో స్థానాన్ని దక్కించుకుంది. తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీగా భక్తులు తరలి వస్తుండటంతో ఆలయానికి ఆదాయం పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తీకమాస వేళ రాజన్న దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

**fఅంజన్న దర్శనానికి పెరిగిన రద్దీ**

కొండగట్టు అంజన్న ఆలయం రూ.21.98 కోట్ల ఆదాయంతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇటీవల ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వీకెండ్‌లలో పెరుగుతున్న రద్దీ కారణంగా ఆలయ ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది.



# మిషన్ భగీరథ త్రాగునీటిని కాలువల క్యూరింగ్ కు వాడుతారా?

- - ఇరిగేషన్ కాలువల క్యూరింగ్ కు మిషన్ భగీరథ త్రాగునీరు వాడడంపై పెద్దేముల్ సర్పంచ్ డివై నర్సింహులు ఆరోపణలు
- మిషన్ భగీరథ త్రాగునీటి దారి మళ్ళింపుపై ఏఈతో ఫోన్ లో మాట్లాడిన గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు
- స్పందించి స్కవర్ వాల్ కు అమర్చిన పైపును తీసివేయించిన మిషన్ భగీరథ అధికారులు

**పెద్దేముల్, మే 17(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామ బీపీటీ నుండి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ త్రాగునీటిని ఇరిగేషన్ కాలువల క్యూరింగ్ కొరకు దారి మళ్ళించి వినియోగించడం ఏమిటని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు ఆరోపించారు. ఆదివారం పెద్దేముల్ గ్రామ శివారులోని పెద్ద కానల వద్ద ఉన్న మిషన్ భగీరథ త్రాగునీటి స్కవర్ వాల్‌కు ఓ పెద్ద పైప్ ను అమర్చి మిషన్ భగీరథ త్రాగునీటిని దారి మళ్ళించిన విషయాన్ని ఆదివారం గుర్తించారు.ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు మాట్లాడుతూ పెద్దేముల్ గ్రామంతో పాటు చుట్టుపక్కల 21 గ్రామాలకు గత మూడు రోజులుగా మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా నిలిచిపోయి త్రాగునీరు రావడం లేదని అన్నారు. అంతేకాకుండా పెద్దేముల్ మండల పరిధిలోని కేజీబీవీ మారేపల్లి,గొట్లపల్లి మోడల్ స్కూల్, పెద్దేముల్ బీసీ హాస్టల్ లకు కూడా తాగునీరు అందడం లేదని ఆరోపించారు.

ముఖ్యంగా మారేపల్లి బీపీటీ నుండి 21 గ్రామాలతోపాటు పలు హాస్టల్ లకు ప్రతీ రోజు మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా అవుతుందని అన్నారు.ఇదిలా ఉండగా మిషన్ భగీరథ త్రాగునీటి స్కవర్ వాల్‌కు అక్రమంగా కొంతమంది ఓ పెద్ద పైప్ అమర్చి, కొత్తగా నిర్మిస్తున్న కెనాల్ కాలువల క్యూరింగ్ పనులకు మిషన్ భగీరథ త్రాగునీటిని వినియోగిస్తున్నట్లు గుర్తించామని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు తెలిపారు. ఎండాకాలంలో ప్రజలు ఒకవైపు తాగునీటి కోసం అల్లాడిపోతూ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుంటే, త్రాగునీటిని కాలువల క్యూరింగ్ కొరకు వాడటం దారుణమని మండిపడ్డారు.ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈతో మాట్లాడి వారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు సర్పంచ్ డివై నర్సింహులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టి గ్రామాలకు మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

**మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ఏఈ రామకృష్ణ వివరణ**

ఈ విషయమై పెద్దేముల్ మండల మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ఏఈ రామకృష్ణను వివరణ కోరగా.....పెద్దేముల్ గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ స్కవర్ వాల్ కు ఓ పెద్ద పైప్ ను అమర్చి మిషన్ భగీరథ త్రాగునీటిని దారి మళ్ళించినట్లు పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు ద్వారా తమ దృష్టికి వచ్చిందని అన్నారు.వెంటనే ఆ స్కవర్ వాల్ కు అమర్చిన పైప్ ను తీసివేయించడం జరిగిందని అన్నారు. ఎవరైనా మిషన్ భగీరథ త్రాగునీటిని దారి మళ్ళించి ఇతర అవసరాలకు అక్రమంగా వాడుకొంటే వారి పైనా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడతామని ఏఈ రామకృష్ణ వివరణలో తెలిపారు.





## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**పెద్దేముల్, మే 17(ప్రజాక్షేత్రం):**

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్,టోర్నమెంట్ స్పాన్సర్,తాండూరు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, పెద్దేముల్ సొసైటీ డైరెక్టర్ కోహిర్ రవి శంకర్ లు అన్నారు. గత రెండు రోజులుగా పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పెద్దేముల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పినెముల మహిపాల్ రెడ్డి, తాండూరు మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ జితేందర్ రెడ్డి ల సౌజన్యంతో నిర్వహించిన PPL సీజన్4 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి టోర్నమెంట్లు ఐక్యతను పెంచుతాయని తెలిపారు.పెద్దేముల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారులు వివిధ రకాల క్రీడలు ఆడుకోవడానికి భవిష్యత్ ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకొంటామని అన్నారు. క్రీడాకారులు సోదర భావంతో, క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ క్రీడలు ఆడుకోవాలని అన్నారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు.ఇదిలా ఉండగా ఫైనల్ పోరులో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దేముల్ ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది.అలాగే పెద్దేముల్ ESC జట్టు రన్నరప్‌గా నిలిచి మంచి ప్రతిభ కనబరిచింది. తదుపరి టోర్నమెంట్ బెస్ట్ బౌలర్ గా చిన్న (నవీన్ ), బెస్ట్ బ్యాట్స్ మెన్ గా శంకర్ గౌడ్,బెస్ట్ క్యాచ్ అందుకున్న ఫీల్డర్ గా అరవింద్, టోర్నమెంట్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా సమీర్ లు మంచి ప్రతిభను కనబరిచారు.ఈ సందర్భంగా విజేతలకు, అద్భుతమైన ఆటను ప్రదర్శించిన వారికి ట్రోఫీలు,మెడల్ లను అందించారు .ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు పరియాద అరుణ్,అంబి, తన్వీర్, ఆదర్శ్ రెడ్డి, నవీన్(చిన్నా), ఆయా జట్ల క్రీడాకారులు,గ్రామ యువకులు,తదితరులు పాల్గొన్నారు.



## ఎందమూరి లేఔట్ నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు

**కుత్బుల్లాపూర్, మే 17(ప్రజాక్షేత్రం):**

మహదేవపురం డివిజన్ ఎండమూరి లేఔట్‌లో నూతన అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా గీద సుమన్ రెడ్డి, చైర్మన్‌గా వెంకట్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్‌గా మల్లేశం, కోశాధికారులుగా అకెళ్ళ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్‌గా రవి ,సజన్ ఎన్నికయ్యారు.అదేవిధంగా సలహాదారులుగా శివానంద్ మాడపాటి, వీరబాబు, అంజి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చందు, రమేష్ రెడ్డి, అప్పారావు, కృష్ణ యాదవ్ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గోవింద్, భీమా రెడ్డి, కంచి రవి, శ్రీకాంత్ రెడ్డి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, పెద్దలు, మాజీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు మరియు జనరల్ సెక్రటరీ మాట్లాడుతూ, కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్ల సమస్యలను త్వరితగతిన ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అలాగే మా నూతన కార్యవర్గ యెన్నిక సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

**కరీంనగర్ /గంగాధర, మే 17 (ప్రజాక్షేత్రం):**

స్థానిక జడ్.పి.హెచ్.ఎస్ ఉప్పెరమల్యాల పాఠశాలలో 200506 SSC బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలిసి హాజరై పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందభరిత వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి దశలో జరిగిన అనుభవాలు, అప్పటి మధుర జ్ఞాపకాలు, స్నేహ బంధాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ, “కాలం మారినా స్నేహం మాత్రం మారదని, ఇలాంటి సమ్మేళనాలు మన మధ్య బంధాలను మరింత బలోపేతం చేస్తాయని” పేర్కొన్నారు. పాఠశాలలో చదివిన రోజుల్ని మరోసారి గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా నిర్వాహక కమిటీ సభ్యులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.




## దేవాదాయ శాఖకు 190 ఈఓ పోస్టులు..

- డాక్టర్ జి చిన్నారెడ్డికి ఘన సన్మానం

**వనపర్తి, మే 17(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖలో నూతనంగా 190 కార్యనిర్వహణాధికారి (ఈఓ) పోస్టులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం లభించిన సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిను నూతన ఈఓలు ఆదివారం ఘనంగా సన్మానించారు. వనపర్తిలోని ఆయన నివాసంలో పూల బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అనేక ప్రాచీన దేవాలయాలు తగిన నిర్వహణాధికారుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. నూతనంగా 190 ఈఓ పోస్టుల మంజూరుతో ఆలయ పరిపాలన వ్యవస్థ గాడిలో పడటంతో పాటు దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల విలువైన దేవాదాయ శాఖ ఆస్తులను కాపాడడంలో ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని అన్నారు. కొత్తగా నియమితులైన కార్యనిర్వహణాధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి దేవాదాయ శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం రాష్ట్రనాయకులు జనుంపల్లి జయపాల్ రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, బండారు యుగంధర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# వడ్లం ఎస్సీ కాలనీలో నూతన స్ట్రీట్ లైట్ల ప్రారంభం

- **గ్రామంలో వెలుగుల సమస్యకు చెక్**
- **నాగరాజ్ ముదిరాజ్ చేతుల మీదుగా**

**కొడప్‌గల్ మే 17(ప్రజాక్షేత్రం):**

పెద్ద కొడప్‌గల్ మండలం వడ్లం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతన స్ట్రీట్ లైట్లను మండల బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు నాగరాజ్ ముదిరాజ్ ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎస్సీ కాలనీలో చాలా కాలంగా వెలుగుల సమస్య ఉండటంతో ప్రజలు రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల అభ్యర్థన మేరకు స్ట్రీట్ లైట్ల ఏర్పాటు చేపట్టినట్లు చెప్పారు. స్ట్రీట్ లైట్ల ఏర్పాటు వల్ల కాలనీలో రాత్రి సమయంలో ప్రజలు సురక్షితంగా సంచరించడంతో పాటు మహిళలు, వృద్ధులు, విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాగరాజ్ ముదిరాజ్ పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, శ్రీదేవి వార్డు సభ్యులు, శామప్ప, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



# టిఎంయుఎన్ వేదికపై మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- **ఆరు రాష్ట్రస్థాయి అవార్డులతో సంగారెడ్డి జిల్లాకు గౌరవం**

**సదాశివపేట మే 17(ప్రజాక్షేత్రం):**


హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని TGIRD సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. వివిధ కమిటీలలో జరిగిన చర్చలు, నాయకత్వ నైపుణ్యాలు, అంతర్జాతీయ అంశాలపై విశ్లేషణాత్మక ప్రసంగాలు మరియు సమర్థవంతమైన ప్రాతినిధ్యంతో జిల్లా విద్యార్థులు అందరినీ ఆకట్టుకున్నారు. నేటి యువతలో దాగి ఉన్న మేధస్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలకు ఈ కార్యక్రమం గొప్ప వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ASPD రాధారెడ్డి విజేతలను ప్రకటించి బహుమతులను అందజేశారు. UNDP కమిటీలో విజేతలు హై కమాండేషన్ అవార్డు అనమిక రాయి - జడ్.పి.హెచ్.ఎస్ దౌలతాబాద్ సదాశివేట. మండల్ కార్తికేయ చారి - జడ్.పి.హెచ్.ఎస్ నందికండి స్పెషల్ మెన్షన్ అవార్డులు ఆరాధ్య - జడ్.పి.హెచ్.ఎస్ చేర్యాల హరి ప్రకాష్ - జడ్.పి.హెచ్.ఎస్ సిరిపురం రిషి అరుణ్ వర్ధన్ - టీజీడబ్ల్యూఆర్ఎస్ సింగూర్ ఇంటర్నేషనల్ ప్రెస్ కమిటీలో స్పెషల్ మెన్షన్ ప్రైస్ జిక్రా మహీన్ - జడ్.పి.హెచ్.ఎస్ న్యాల్కల్ ఈ విధంగా మొత్తం ఆరు రాష్ట్రస్థాయి అవార్డులను సంగారెడ్డి జిల్లా విద్యార్థులు కైవసం చేసుకొని జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో చాటారు. ప్రత్యేకంగా జడ్.పి.హెచ్.ఎస్ నందికండి విద్యార్థి దాసరి మండల్ కార్తికేయ చారి సాధించిన విజయానికి గైడ్ టీచర్ శశికళ టీచర్ గారి మార్గదర్శనం, ప్రధానోపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో విలువైనదిగా నిలిచింది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై నిలబడే ధైర్యాన్ని కల్పించడంలో వారి కృషి ప్రశంసనీయమైంది. ఇట్టి కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రామ్ రెడ్డి, నారాయణమ్మ, సంగమేశ్వర్, కవిత గారు విద్యార్థులకు గైడ్ టీచర్లుగా వ్యవహరించారు. రాష్ట్రస్థాయి అవార్డులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మరియు జిల్లా విద్యాధికారి ఎస్ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అవకాశాలు లభిస్తే ఏ వేదికలోనైనా తమ ప్రతిభను నిరూపించగలరని సంగారెడ్డి విద్యార్థులు మరోసారి రాష్ట్రానికి చాటి చెప్పారు.



# శుభ కార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పైడి

**నిజామాబాదు మే 17(ప్రజాక్షేత్రం):**

ఆదివారం నాడు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నందిపేట్ మండలంలో పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. బాద్గుణ గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి సోదరుడు శ్రీకాంత్ దంపతుల కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం ఉమ్మెడ గ్రామానికి చెందిన గాజుల సాగర్ కుమారుల నూతన వస్త్రలంకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించడం జరిగింది. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తో పాటు బద్గుణ ఉప సర్పంచ్ శివ, ఉమ్మెడ మాజీ ఉప సర్పంచ్ గుడ్డోళ్ల సాయి రెడ్డి, భూతం సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గురువు సేవలు సమాజానికి దిక్సూచి

- **ప్రతిభావంతుల విద్యార్థులకు సన్మానం చేసిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**కరీంనగర్, మే 17(ప్రజాక్షేత్రం):**

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "విద్యా విజయోత్సవం" కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో గురువు స్థానం ఎంతో గొప్పదని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, ఉన్నత లక్ష్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు విశిష్టమని అన్నారు. పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపిన తల్లిదండ్రులు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలపై ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు విద్య, క్రీడలు, సాంకేతిక రంగాలతో పాటు పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ చాటుతున్నారని



చెప్పారు. విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులకు ప్రభుత్వ విద్యార్థుల విజయాలే నిదర్శనమని, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, విద్యాశాఖ ఏడీ మాధవి, సెక్టోరల్ అధికారులు మిల్కురి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, దాసి శ్రీనివాస్, ఉమారాణి, మహేందర్, రవీందర్, డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి

- **ఆటోను తాళ్లతో లాగుతూ సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నిరసన**

**ఆత్మకూరు, మే 17(ప్రజాక్షేత్రం):**

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆటోను తాళ్లతో లాగుతూ నాయకులు, కార్యకర్తలు వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ సబ్‌డివిజన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వరుసగా ఇంధన ధరలు పెరగడంతో వాహనదారులపై తీవ్ర భారం పడుతోందని, నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయని అన్నారు. వంటగ్యాస్, సిఎన్‌జీ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నూనె, పప్పుదినుసులు, బియ్యం, గోధుమలు, సబ్బులు తదితర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి. వెంకటయ్య, బాలస్వామి, అంజి, కార్మికులు రాములు, వెంకటన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన చిన్నా రెడ్డి

**వనపర్తి, మే 17(ప్రజాక్షేత్రం):**

జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి నివాసంలో ఆదివారం 111 మంది లబ్ధిదారులకు 28,22,000 రూపాయల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందలేని పేదలకు వైద్య ఖర్చులు భరించడానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్నాం. ఈ ఫండ్ పేదల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది, వారి జీవితాల్లో అండగా నిలుస్తుంది" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో చెక్కులను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య వనపర్తి జిల్లా మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ మాజీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు దేవన్న యాదవ్, చంద్రశేఖర్ వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి నిరంజన్ బాబా, బండారు యుగంధర్ మండల యూత్ అధ్యక్షులు ఆవుల చంద్రశేఖర్, గంగాధర్, అనిల్ నాయుడు, ఎన్ఎస్‌యుఐ వనపర్తి మండల అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గట్టు మన్యం సీనియర్ పార్టీ నాయకులు మద్దిలేటి శ్రీరంగాపురం సర్పంచ్, చిట్టిబాబు, ఈశ్వర్ రెడ్డి, ఎంట్ల రవి, యుగంధర్ రెడ్డి, కొండన్న, బాల్ రాజు, సత్యం, బాలచందర్, రఘు లబ్ధిదారులు ఈ చెక్కులను అందుకుని సీఎం రేవంత్ రెడ్డి, డాక్టర్ చిన్నారెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# రైతు సంక్షేమమే మోడీ సర్కారు లక్ష్యం

- **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి**

**నర్వ మే 17(ప్రజాక్షేత్రం):**



రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ పనిచేస్తున్నదని బిజెపి రాష్ట్ర నాయకులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ లో మరోసారి పంటలకు మద్దతు ధర పెంచి నిర్ణయం తీసుకోవడం హర్షదాయకమని అన్నారు. మద్దతు ధర పెంపుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతు పండించిన పంటకు లాభదాయకమైన గిట్టుబాటు ధరను అందించడమే కాకుండా రైతు ఆదాయ భద్రతను పటిష్టం చేస్తుందని అన్నారు. దేశీయ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. రైతు సంక్షేమానికి కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. అందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీ కృతజ్ఞతలు తెలిపిన బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి.



# ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

- **40వ మెడికల్ క్యాంప్‌ను సందర్శించిన కిషోర్ రెడ్డి**
- **డబుల్ బెడ్‌రూమ్ వాసులకు ఆరోగ్య భరోసా**
- **ఆరోగ్య సేవలు ప్రతి ఇంటికీ చేరాలి:కిషోర్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, మే 17(ప్రజాక్షేత్రం):**

కైసర్ నగర్, గాజులరామారంలో నిర్వహించిన 40వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ & కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి సందర్శించారు. శిబిరంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నివసించే ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సను వాయిదా వేసుకోకుండా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్ కుమార్, గంట శివారెడ్డి, రంజిత్ రెడ్డి, సరిత యాదవ్, వేణు, వలి, యాదగిరి, సునీల్, నర్సింహా రెడ్డి, సాధు యాదవ్, భరత్ రెడ్డి, ఉదయ్, రాకేష్, రితిక్, భీమ్‌తో పాటు బీకేఆర్ ఫౌండేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# "రోడ్డు లేదు..లైట్లు లేవు"...... ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి

- **చీకట్లో సింహపురి కాలనీ రహదారులు..చర్యలు కోరిన స్థానిక నాయకులు**

**కుత్బుల్లాపూర్, మే 17(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని 295 డివిజన్ బౌరంపేట్ గ్రామం వాసులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె. పి వివేకానంద ను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన కాలనీవాసులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సింహపురి కాలనీ నుండి మై స్పేస్ -2 భవనం వద్ద నుంచి బౌరంపేట్ బొడ్రాయి వరకు వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రివేళ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు మొత్తం చీకటిగా మారడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొంటూ వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మై స్పేస్ -2 నుండి బౌరంపేట్ బొడ్రాయి వరకు ఉన్న రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని రామాసి కుంటలోకి కాలనీ మురుగు నీరు చేరడంతో తీవ్ర దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమల సమస్య పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మురుగు నీటిని మళ్లించి అక్కడ పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్వీ సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
18.05.2026
సోమవారం | హైదరాబాద్

## సాయిబాబా నగర్‌లో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

- టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- అధికారుల దృష్టికి తీసుకువచ్చిన స్పందన కరువు
- అనుమతులకు విరుద్ధంగా జి ప్లస్ త్రీ నిర్మాణం



**కుత్బుల్లాపూర్, మే 17(ప్రజాక్షేత్రం):**

కొంపల్లి సర్కిల్ పరిధిలోని సూరారం సాయిబాబా నగర్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వీరస్వామి బస్తీలో అనుమతులకు విరుద్ధంగా జి ప్లస్ త్రీ పెంట్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం ఎలాంటి సరైన సెట్‌బ్యాక్స్ లేకుండానే భారీ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాయిబాబా నగర్ పరిధిలోని వివిధ బస్తీల్లో కూడా ఇలాగే అనేక అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులకు విరుద్ధంగా కొనసాగుతున్న నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి అక్రమ కట్టడాలు పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బీజేపీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేయాలి:రామచంద్రరావు

- దాసి నాగరాజుకు రాష్ట్ర అధ్యక్షుడు అభినందనలు
- రాష్ట్రంలో అధికారమే లక్ష్యం..బీజేపీ శ్రేణులకు దిశానిర్దేశం

**కుత్బుల్లాపూర్ మే 17(ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దాసి నాగరాజు మర్యాదపూర్వకంగా రాష్ట్ర అధ్యక్షులను కలిశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ నాయకత్వంలో పనిచేస్తూ రాష్ట్రంలోని ఎస్సీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కట్టుబడి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించిన ఆయన, ఆ అంశాలపై పార్టీ తరఫున పూర్తి స్థాయి పోరాటానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దాసి నాగరాజును అభినందించిన రామచంద్రరావు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దాసి నాగరాజు రాష్ట్ర అధ్యక్షులను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ కోకన్వీనర్ డాక్టర్ ఎం.ఆర్.ఎస్ రాజు, కేడబ్ల్యూఎస్ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా బంగారుపాళ్యం ఎస్. సుబ్రహ్మణ్యం.

- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ ను కలసి కృతజ్ఞతలు తెలియజేసిన ఎస్. సుబ్రహ్మణ్యం.



**బంగారుపాలెం మే 17(ప్రజాక్షేత్రం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం స్థానిక వైయస్సార్సీపి నేతగా జిల్లా ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి గా ఎస్. సుబ్రహ్మణ్యం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందున సందర్భంగా ఆదివారం పలమనేరు లోని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ స్వగృహమునందు మర్యాదపూర్వకంగా తన అనుచరులతో కలవడం జరిగింది. డాక్టర్ సునీల్ కుమార్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవి రావడం పట్ల ఏపీ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, పూతలపట్టు నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లలిత థామస్, రాష్ట్ర పాలయకరి సంఘ అధ్యక్షులు ఎం బి కుమార్ రాజా, బంగారుపాలెం మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి లకు పేరుపేరునా ఎస్. సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలియజేశారు.

# గూడూరు రేంజ్ పరిధిలోని ముసలమ్మ గుడి అడవుల్లో దారుణం

- వన్య మృగాల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చులో పడి పాడి గేదె మృతి

**కొత్తగూడ, మే 17(ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా గూడూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కొత్తగూడ మండలం గుంజేడు ముసలమ్మ దేవస్థాన పరిసర అడవుల్లో వేటగాళ్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అడవి జంతువుల వేట కోసం కొందరు కిరాతకులు అమర్చిన విద్యుత్ ఉచ్చు (లైవ్ కరెంట్ వైర్లు) ఒక పాడి జంతువు ప్రాణాలను బలితీసుకుంది. స్థానిక రైతు బిజ్జ వెంకన్నకు చెందిన బర్రె (గేదె) మేతకై అడవిలోకి వెళ్లి, ఈ విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందింది. తమ అమర్చిన కరెంట్ తీగలకు బర్రె బలికావడంతో, ఎక్కడ విషయం బయటపడుతుందోనని భయపడిన వేటగాళ్లు దారుణానికి ఒడిగట్టారు. చనిపోయిన బర్రె కళేబరాన్ని గుట్టుచప్పుడు కాకుండా సమీపంలోని పొదల్లో దాచిపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు.

**తునికాకు కూలీల అప్రమత్తత..**
**తృటిలో తప్పిన ముప్పు!**

ప్రస్తుతం తునికాకు సేకరణ సీజన్ కావడంతో, స్థానిక కూలీలు ప్రతిరోజూ తెల్లవారుజామునే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని అడవి బాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం ఆకు సేకరణ కోసం అడవిలోకి వెళ్లిన కూలీలకు పొదల్లో దాచి ఉంచిన బర్రె కళేబరం కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. కాస్త ముందుకు వెళ్లి పరిశీలించగా, అక్కడ వేటగాళ్లు అమర్చిన లైవ్ కరెంట్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ కనిపించాయి.

**గూడూరు రేంజ్ అధికారుల నిఘా కరవు?**

గూడూరు రేంజ్ పరిధిలోని అడవుల్లో వన్య ప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతున్నా అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అడవుల్లో కరెంట్ తీగలు అమర్చుతుంటే సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గూడూరు రేంజ్ ఉన్నతాధికారులు స్పందించి, అడవుల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని, విద్యుత్ ఉచ్చులు వేసి మూగజీవాల మృతికి, కూలీల ప్రాణసంకటానికి కారణమవుతున్న వేటగాళ్లను కఠినంగా శిక్షించాలని బాధితుడు వెంకన్నతో పాటు స్థానిక ప్రజలు, కూలీలు డిమాండ్ చేస్తున్నారు.



## డాక్టర్ సునీల్ కుమార్ కుకృతజ్ఞతలు తెలిపిన మోగిలి మునీంద్ర

**బంగారుపాలెం మే 17(ప్రజాక్షేత్రం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలికి చెందిన మునేంద్ర కు జిల్లా ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమించడం పట్ల ఆదివారం పలమనేరు లోని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ స్వగృహమునందు మర్యాదపూర్వకంగా తన అనుచరులు మరియు మొగిలి గ్రామస్తులతో కలవడం జరిగింది. డాక్టర్ సునీల్ కుమార్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. తాను 35 సంవత్సరాల అనుభవంలో కాంగ్రెస్, వైయస్ఆర్సీపీ పార్టీలకు ఎంతో సేవ చేశానని తనను గుర్తించి జిల్లా స్థాయిలో పదవి కల్పించినందుకు వైఎస్ఆర్సిపి పార్టీకి ఎంతో రుణపడి ఉంటానని, 2029 వ సంవత్సరంలో రెండవసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చూడాలన్న కోరిక కోసం జిల్లా అంతట పర్యటించి తన సాయి శక్తుల కష్టపడి పని చేస్తానని ఆదివారం పత్రిక ముఖంగా మునేంద్ర తెలిపారు. తనకు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవి రావడం పట్ల ఏపీ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, పూతలపట్టు నియోజవర్గ సమన్వయ కర్త డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లలిత థామస్, రాష్ట్ర పాలయకరి సంఘ అధ్యక్షులు ఎం బి కుమార్ రాజా, బంగారు పాలెం మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి లకు మొగిలి మునేంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొగిలి పంచాయతీ నుండి ప్రభాకర్ రెడ్డి,బాలాజీ, హరీష్ నాయుడు, చిన్న, చైతన్య, కార్తీక్, దేవేందర్ రెడ్డి,ఠాగూర్, మునిధర్, సాయికుమార్, కాశి, సాయికుమార్, బాబు, లోచన్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ

**వికారాబాద్ మే 17(ప్రజాక్షేత్రం):**

జిల్లాలోని అన్ని గ్రామాలలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల నిర్మాణం చేపడుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ అన్నారు.ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ అధ్యక్షతన జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ హాజరయ్యారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ మాట్లాడుతూ.... జులై 7నాటికి వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, గ్రామ కమిటీలు పటిష్టంగా నిర్మించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలు పర్మినెంట్ గా నిర్మించాలని, రేపటి నుంచి జూలై 5వరకు అన్ని మండలాల ఇంచార్జీలు ఆ మండల పరిధిలోని అన్ని గ్రామాలకు గోటు విలేజ్ అనే కార్యాచరణతో నిత్యం గ్రామాల్లో మాదిగలతో మమేకం అవ్వాలని తెలిపారు. ముఖ్యంగా మాదిగ యువత విద్యపై ప్రత్యేక శ్రద్ధ ఉంచేలా వారికి స్ఫూర్తిని నింపాలని తెలియజేశారు. జులై 7నాటికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కమిటీలు పటిష్టంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, జిల్లా ఉప అధ్యక్షులు బి,కృష్ణ మాదిగ, జింగుర్తి నర్సింలు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్ మాదిగ, జిల్లా కార్యదర్శి మహేందర్ మాదిగ, పూడూరు మండల అధ్యక్షుడు యేసు మాదిగ, జిల్లా సీనియర్ నాయకులు రవి మాదిగ, బంటారం మండలం ఇంచార్జి భరత్ మాదిగ, బాలరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.



## బస్తీబాటలో బీకేఆర్..గ్రీన్ హిల్స్ సమస్యలపై ఫోకస్

- కాలనీల అభివృద్ధే లక్ష్యం:బొంగునూరి కిషోర్ రెడ్డి
- డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడిన బీకేఆర్
- రోడ్లు, డ్రైనేజీల దుస్థితిపై స్థానికుల ఆవేదన

**కుత్బుల్లాపూర్, మే 17(ప్రజాక్షేత్రం)**

దుండిగల్ సర్కిల్ పరిధి బహదూర్‌పల్లి డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో నిర్వహించిన "మార్నింగ్ వాక్ - బస్తీబాట" కార్యక్రమంలో రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి (బీకేఆర్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు, స్థానిక ప్రజలతో కలిసి కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ, దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, రోడ్లు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు బీకేఆర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కట్టుబడి ఉంటానని ఆయన తెలిపారు. ప్రతిరోజూ బస్తీబాట కార్యక్రమం ద్వారా బహదూర్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఏఆర్. సాదు యాదవ్, వేణు కుమార్ తో పాటు అమర్నాథ్, దామోదర్, రాజిరెడ్డి, బీర యాదవ్, వెంకటేష్ గౌడ్, వీరన్న, చంద్రయ్య, విశ్వనాథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, అనంత రాములు, రవీందర్, రాజశేఖర్, రఘుపతి రెడ్డి, సాయి, పృధ్వి, ప్రవీణ్ ముదిరాజ్, కాలనీ వారు పాల్గొన్నారు.



## డాక్టర్ సునీల్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపిన మోగిలి మునీంద్ర

**బంగారుపాలెం మే 17(ప్రజాక్షేత్రం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలికి చెందిన మునేంద్ర కు జిల్లా ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి గా నియమించడం పట్ల ఆదివారం పలమనేరు లోని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ స్వగృహమునందు మర్యాదపూర్వకంగా తన అనుచరులు మరియు మొగిలి గ్రామస్తులతో కలవడం జరిగింది. డాక్టర్ సునీల్ కుమార్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. తాను 35 సంవత్సరాల అనుభవంలో కాంగ్రెస్, వైయస్ఆర్సీపీ పార్టీలకు ఎంతో సేవ చేశానని తనను గుర్తించి జిల్లా స్థాయిలో పదవి కల్పించినందుకు వైఎస్ఆర్సిపి పార్టీకి ఎంతో రుణపడి ఉంటానని, 2029 వ సంవత్సరంలో రెండవసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చూడాలన్న కోరిక కోసం జిల్లా అంతట పర్యటించి తన సాయి శక్తుల కష్టపడి పని చేస్తానని ఆదివారం పత్రిక ముఖంగా మునేంద్ర తెలిపారు. తనకు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పదవి రావడం పట్ల ఏపీ మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, పూతలపట్టు నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లలిత థామస్, రాష్ట్ర పాలయకరి సంఘ అధ్యక్షులు ఎం బి కుమార్ రాజా, బంగారుపాలెం మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి లకు మొగిలి మునేంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొగిలి పంచాయతీ నుండి ప్రభాకర్ రెడ్డి,బాలాజీ, హరీష్ నాయుడు, చిన్న, చైతన్య, కార్తీక్, దేవేందర్ రెడ్డి,ఠాగూర్, మునిధర్, సాయికుమార్, కాశి, సాయికుమార్, బాబు, లోచన్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు



# వాహనదారులకు షాక్.. మళ్లీ పెరిగిన సీఎన్‌జీ ధరలు

- **కేజీ సీఎన్‌జీపై రూ.1 పెంపు**
- **రెండు రోజుల్లో రెండోసారి పెరిగిన ధరలు**
- **మొత్తంగా రూ.3 అదనపు భారం**
- **ఢిల్లీలో కేజీ ధర రూ.80.09**

**హైదరాబాద్ మే 17(ప్రజాక్షేత్రం):**

వాహనదారులపై ఇంధన భారం మరింత పెరిగింది. సీఎన్‌జీ ధరలను కేంద్రం మరోసారి పెంచింది. కేజీకి ఒక రూపాయి చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ ధరలు రెండోసారి పెరిగాయి. శుక్రవారం కూడా కేజీ గ్యాస్‌పై రూ.2 చొప్పున పెంచారు. దీంతో మూడు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ వాహనదారులపై రూ.3 అదనపు భారం పడినట్లయింది. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో సీఎన్‌జీ ధర కేజీ రూ.80.09కి చేరింది. నోయిడాగాజియాబాద్ ప్రాంతంలో ఈ రేటు రూ.88.70గా నమోదైంది. ముంబయిలో రూ.84.09కి, హైదరాబాద్‌లో రూ.100కు చేరింది. పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధిలో ఆంక్షల నేపథ్యంలో గ్యాస్, చమురు ట్యాంకర్లు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో అంతర్జాతీయ ఉత్పత్తి, సరఫరా దెబ్బతిన్నాయి. దీంతో ఇంధన కొరత ఏర్పడింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగాయి. ఫలితంగా దేశీయంగానూ ధరల పెంపు అనివార్యమైంది.




# గోవా బీచ్‌ల్లో తగ్గిన విదేశీయుల సందడి... 'పార్టీ క్యాపిటల్'కు ఏమైంది?

- **గోవాకు గణనీయంగా తగ్గిన విదేశీ పర్యాటకుల సంఖ్య**
- **అదే సమయంలో రికార్డు స్థాయిలో పెరిగిన దేశీయ పర్యాటకులు**
- **విమాన, వీసా ఖర్చులు పెరగడం, ఇతర దేశాల పోటీ ప్రధాన కారణాలు**
- **స్థానికంగా ట్యాక్సీ సమస్యలు, పరిశుభ్రత లోపం కూడా ప్రభావం**
- **ఆర్థిక వ్యవస్థపై ప్రభావం, పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు**

**నేషనల్ బ్యూరో మే 17(ప్రజాక్షేత్రం):**

భారతదేశపు 'పార్టీ క్యాపిటల్'గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన గోవాకు విదేశీ పర్యాటకుల తాకిడి గణనీయంగా తగ్గుతోంది. ఒకప్పుడు యూరోపియన్లు, రష్యన్లతో కళకళలాడిన గోవా బీచ్‌లు ఇప్పుడు ఎక్కువగా దేశీయ పర్యాటకులతో నిండిపోతున్నాయి. ఈ మార్పు స్థానిక పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గోవా పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం, 2017లో సుమారు 9 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాగా, 2025 నాటికి ఆ సంఖ్య 5 లక్షలకు పడిపోయింది. మరోవైపు, దేశీయ పర్యాటకుల సంఖ్య 2016లో 68 లక్షల నుంచి గత ఏడాది నాటికి కోటి మార్కును దాటింది. విదేశీ పర్యాటకులు తగ్గడానికి పలు అంతర్జాతీయ, స్థానిక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఉక్రెయిన్‌రష్యా యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల కారణంగా విమాన టిక్కెట్ల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు, శ్రీలంక, వియత్నామ్, థాయ్‌లాండ్ వంటి దేశాలు చౌక ధరలు, సులభమైన వీసా విధానాలతో గట్టిపోటీ ఇస్తున్నాయి. స్థానికంగా కూడా అనేక సమస్యలు విదేశీయులను దూరం చేస్తున్నాయి. వీసా నిబంధనలు కఠినతరం కావడం, ఫీజులు పెరగడం ఒక కారణమైతే, లండన్‌గోవా డైరెక్ట్ ఫ్లైట్ రద్దు కావడం కూడా ప్రతికూలంగా మారింది. యాప్ ఆధారిత ట్యాక్సీ సేవలను స్థానిక యూనియన్లు వ్యతిరేకించడంతో అధిక ఛార్జీలు, ట్యాక్సీల లభ్యత లేకపోవడం పర్యాటకులకు పెద్ద తలనొప్పిగా మారింది. బీచ్‌లకు వెళ్లే దారుల్లో చెత్త, పరిశుభ్రత లోపం వంటివి కూడా వారిని నిరుత్సాహపరుస్తున్నాయి. విదేశీ పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసి, అధికంగా ఖర్చు చేస్తారని, వారి సంఖ్య తగ్గడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతోందని హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై స్పందించిన గోవా పర్యాటక మంత్రి రోహన్ ఖాంటే, ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితులే దీనికి కారణమని, పర్యాటకులను తిరిగి ఆకర్షించేందుకు పోలాండ్, స్కాండినేవియా దేశాల్లో రోడ్ షోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆసియా, ఆఫ్రికా మార్కెట్లపై కూడా దృష్టి సారిస్తామని ఆయన వివరించారు. 1960ల నాటి హిప్పీ సంస్కృతి నుంచి 'సుసేగాడ్' (నెమ్మదైన జీవనశైలి)తో ఆకట్టుకున్న గోవా, ఇప్పుడు తన ప్రాభవాన్ని నిలుపుకోవాలంటే తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# అక్రమ నిర్మాణాలు ఇక్కడ...అధికారులు ఎక్కడ?

- **సెట్‌బ్యాక్ లేదు...పర్మిషన్ లేదు...అయినా ఫుల్ స్పీడ్‌లో బిల్డింగ్స్..!**
- **అక్రమ కట్టడాలకు అధికారుల 'సైలెంట్ సపోర్ట్'..?**
- **48 గంటల్లోనే మళ్లీ లేచిన అక్రమ నిర్మాణాలు**
- **"కూల్చాం"అంటున్న అధికారులు... "కడుతున్నారు" అంటున్న ప్రజలు**

**కుత్బుల్లాపూర్, మే 17(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని డి.పోచంపల్లి 168 సర్వే నెంబర్‌లో గల గణేష్ నగర్ ప్రస్తుతం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "జీరో పర్మిషన్ - ఫుల్ కన్స్ట్రక్షన్" అన్నట్టుగా ఎలాంటి అనుమతులు లేకుండానే భవనాలు వేగంగా వెలుస్తుండగా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం మౌన వీక్షకులుగా మారారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం కనిపించడం లేదని చెబుతున్నారు. ఎలాంటి సెట్ బ్యాక్‌లు లేకుండా, టౌన్ ప్లానింగ్ నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**"కూల్చివేతలు చేశాం"అంటున్న అధికారులు...**

"అదే భవనం మళ్లీ కడుతున్నారు" అంటున్న ప్రజలు కొత్త డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఇటీవల రెండు రోజుల పాటు అక్రమ నిర్మాణాలపై కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఆ కూల్చివేతలు పూర్తిస్థాయిలో జరగలేదని, కేవలం పేరుకే నిర్వహించారని స్థానికులు విమర్శిస్తున్నారు. "కూల్చివేత జరిగిన 48 గంటల్లోనే మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అధికారులు నిజంగా కూల్చారా..? లేక మళ్లీ కట్టుకునేలా మార్గం సుగమం చేశారా..?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**పుట్టగొడుగుల్లా పెరుగుతున్న నిర్మాణాలు కనిపించడంలేదా...?లేక కనిపించనట్టే నటిస్తున్నారా...?**

డి.పోచంపల్లి 168 సర్వే నెంబర్‌లో ప్రస్తుతం జీరో పర్మిషన్‌తో నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులు, ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండా గోడలు, అనుమతులు లేని కమర్షియల్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అక్రమ నిర్మాణాలు బహిరంగంగా కొనసాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**"ఎక్విప్మెంట్ లేదు"అంటున్న టౌన్ ప్లానింగ్..!**





**అయితే అక్రమాలు ఆపేది ఎవరు..?**

దుండిగల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి సరైన కూల్చివేత పరికరాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేకపోతున్నామనే సమాచారం వినిపిస్తోంది. అయితే ఇదే కారణంగా అక్రమ నిర్మాణాలకు పరోక్ష ప్రోత్సాహం లభిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల సైలెన్స్‌పై పెరుగుతున్న అనుమానాలు నిర్లక్ష్యమా...?లేక అక్రమాలకు మౌన మద్దతా...?**

అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతుండగా సంబంధిత అధికారులు మాత్రం స్పందించకపోవడం వెనుక కారణాలేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది.. స్థానికుల దాడిలో హతం!

- **ప్రేమను నిరాకరించిందని జడ్చర్లలో యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు**
- **నిందితుడిని పట్టుకుని తీవ్రంగా కొట్టిన స్థానికులు, బంధువులు**
- **ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిందితుడూ మృతి**
- **యువతికి వేరే వ్యక్తితో నిశ్చితార్థం కావడమే కారణమని ఆరోపణలు**

**మహబూబ్‌నగర్ మే 17(ప్రజాక్షేత్రం):**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది ప్రజల దాడిలో హతమయ్యాడు. ప్రేమను నిరాకరించిందన్న కక్షతో ఓ యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు, ఆ తర్వాత స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ నేడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... జడ్చర్లలోని నిమ్మబావిగడ్డకు చెందిన వైష్ణవి (24) పోలేపల్లి సెజ్‌లోని ఓ పాఠశాలలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వెళుతుండగా, అదే ప్రాంతానికి చెందిన తేజ ఆమెను అడ్డగించాడు. తనను ప్రేమించాలని కొంతకాలంగా వేధిస్తున్న తేజ, వెంట తెచ్చుకున్న కత్తితో వైష్ణవిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గొంతు, కడుపు భాగాల్లో పొడవడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఈ దారుణాన్ని కళ్లారా చూసిన వైష్ణవి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. తేజను పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్ర గాయాలతో ఉన్న తేజను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు.





గత రెండేళ్లుగా తేజ తమ కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని, ఆమె నిరాకరించడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వైష్ణవికి వేరొకరితో నిశ్చితార్థం జరగడం కూడా తేజ కక్ష పెంచుకోవడానికి కారణమైందని చెబుతున్నారు. మరోవైపు, చనిపోయే ముందు తేజ... "వైష్ణవి నన్ను వాడుకుని డబ్బులు తీసుకుని మోసం చేసింది, అందుకే హత్య చేశాను" అని చెప్పినట్లుగా సమాచారం. ఈ ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకోవడంతో జడ్చర్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# 2029లో బీసీలదే అధికారం

- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

**సూర్యాపేట, మే 17(ప్రజాక్షేత్రం):**

2029లో బీసీలు తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని, తెలంగాణ గడ్డ బీసీలకు అడ్డాగా మారిందని ఈ సునామీని ఎవరు ఆపలేరని జాతీయ బీసీ సంక్షేమ సం ఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర మల్సూర్‌గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాధికారం లక్ష్యంగా బీసీ సమాజంలో రాజకీయ చైతన్యం పెరిగిందన్నారు. సింహభాగం ఉన్న బీసీలను పాలకులుగా కాకుండా పాలితులుగా జెండాలు మోసేవారిగా, ఓట్లు వేసే యంత్రాలుగా అణచివేస్తున్నారన్నారు. జూలై 12న హైదరాబాదులో బీసీల రాజకీయ ప్లీనరీ, ఆగస్టు 7న జాతీయ ఓబిసి సమావేశం, సెప్టెంబర్ లో బీసీల రాజ్యాధికార రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా మూడు నెలలు పల్లె నుంచి పట్టణ వరకు రాజకీయ దామాషా రాజ్యాధికారమే లక్ష్యంగా కొనసాగుతుందన్నారు. హైదరాబాదులో డిసెంబర్ లో 10 లక్షల మందితో రాజకీయ యుద్ధభేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, బీసీ ఐకాస చైర్మన్ జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఉప్పల మధు యాదవ్,బీసీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ రామమూర్తి గౌడ్, బీసీ సంక్షేమ సం ఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు, బీసీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల దేవరాజు యాదవ్, అసోసియేటెడ్ అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు పోతు రాజు నరసయ్య, జిల్లా కన్వీనర్ సూర్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపేటలో తల్లీ, కూతురిని నరికి చంపిన దుండగులు!

**నల్లగొండ మే 17(ప్రజాక్షేత్రం):**

నల్లగొండ జిల్లా అనుముల మండలం ఇబ్రహీంపేటకు చెందిన సాయిలు, వెంకటమ్మ దంపతులకు ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కట్నం కానుకలు ఇచ్చి పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశాడు. సాయిలు కొడుకు యాదయ్య, సుమలత దంపతులు తమకున్న 8 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. యాదయ్య, సుమలత దంపతులకు కూతురు లావణ్య జన్మించింది. లావణ్య ఏడాది వయసున్నప్పుడు తండ్రి యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతితో కూతురు లావణ్యతో కలిసి సుమలత ఒంటరిగా ఉంటోంది. తండ్రి నుండి లావణ్యకు వచ్చిన 8 ఎకరాల భూమికి గార్డియన్‌గా తాత సాయిలు ఉన్నారు. ఇదే సమయంలో అనారోగ్యం పాలైన సాయిలు, వెంకటమ్మ వైద్యం కోసం 30 లక్షలు వెచ్చించామని, 8 ఎకరాల భూమి ఇవ్వాలంటూ ముగ్గురు కూతుళ్లు కోర్టులో కేసు వేశారు. కోర్టు తీర్పు ప్రకారం సుమలత.. ఆడపడుచులకు ఐదు లక్షల రూపాయలు చెల్లించి వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకుంది. అప్పటినుండి 8 ఎకరాల భూమి తమ చేతి నుండి జారిపోయిందని బంధువులు.. తల్లి కూతుళ్లు సుమలత, లావణ్యలపై కక్ష పెంచుకున్నారు. తల్లి కూతుర్లను అంతమొందిస్తే భూమి తమ పరమవుతుందని పథకం వేశారు. యధావిధిగా తమ పామాయిల్ తోటలో పని చేసేందుకు ఉదయం తల్లి కూతుళ్లు సుమలత, లావణ్యలు వచ్చారు. పథకం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు కళ్లల్లో కారం చల్లి తల్లి కూతుర్లను చున్నీలతో గొంతు నిలిమి అత్యంత దారుణంగా హతమార్చారు. ఈ దారుణ ఘటనతో ఇబ్రహీంపేట గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి ఆధారాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ డబుల్ మర్డర్ కు భూ తగాదాలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు తెలిపారు.





# పెరుగుతున్న హైబీపీ కేసులు



**హైదరాబాద్ మే 17(ప్రజాక్షేత్రం):**

3045 ఏళ్ల వయసులోనే ముందస్తు పరీక్షలు తప్పనిసరి అని, జీవనశైలి ఒత్తిడే 'సైలెంట్ కిల్లర్' హైపర్‌టెన్షన్‌కు ప్రధాన కారణం అని కేర్ ఆస్పత్రి వైద్యులు హెచ్చరిస్తున్నారు. భారతదేశంలో గుండె సంబంధిత రిస్క్ ప్రొఫైల్లో ఆందోళన కలిగించే మార్పులు కనిపిస్తున్నాయని కేర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. ఒకప్పుడు వృద్ధుల్లో ఎక్కువగా కనిపించే హైపర్టెన్షన్ (రక్తపోటు) ఇప్పుడు 30ల ప్రారంభం నుంచే, 40లలోనే ఎక్కువగా గుర్తిస్తున్న పరిస్థితి నెలకొంటోందని కేర్ హాస్పి టల్స్ హైటెక్ సిటీ డైరెక్టర్ అండ్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ లాలుకోట కృష్ణ మోహన్ వరల్ హైపర్టెన్షన్ డే సందర్భంగా తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి నలుగురు పెద్దల్లో ఒకరికి హైబీపీ ఉండే అవకాశం ఉంది. కానీ వీరిలో చాలా మందికి వ్యాధి ఉన్నట్టు తెలియకుండానే తీవ్రమైన దశకు చేరుతున్న కేసులు ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఇది గుండెపోటు, స్ట్రోక్, కిడ్నీ వ్యాధుల వంటి ప్రాణాంతక సమస్యలకు దారితీస్తోందని వారు హెచ్చరిస్తున్నారు. 40 ఏళ్ల లోపు యసులో సాధారణ ఆరోగ్య పరీక్షలు చేయించుకునే అలవాటు తక్కువగా ఉండటంతో, దాదాపు సగం మంది తమకు హైబీపీ ఉందన్న విషయాన్ని కూడా గుర్తించలేకపోతున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ఒత్తిడి, ఎక్కువ గంటల పాటు కూర్చునే ఉద్యోగ జీవనం, నిద్రలేమి, ఉప్పు అధికంగా ఉన్న ప్రాసెస్డ్ ఆహారం, శారీరక చలనం తగ్గిపోవడం వంటి కారణాలు యువతలో హైబీపీ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వైద్యులు చెబుతు న్నారు. చాలా సందర్భాల్లో అలసట లేదా స్ట్రెస్గా భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యాధి ఆలస్యంగా గుర్తించబడుతోందని తెలిపారు. హైపర్‌టెన్షన్ వృద్ధాప్య వ్యాధి కాదు. ఇప్పుడు అత్యంత చురుకైన వయసులోనే, ముఖ్యంగా కెరీర్ పీక్ దశలో ఉన్నవారిలో ఎక్కువగా కనిపిస్తోంది. అసలు ఆందోళన కలిగించే విష యం దీని 'సైలెంట్ డ్యామేజ్'. గుండె, మెదడు, కిడ్నీలపై దీర్ఘకాలంలో తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. డయాబెటిస్, ఒబెసిటీ, కుటుం బ చరిత్ర, ధూమపానం, అధిక ఒత్తిడి ఉన్నవారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా బీపీ చెక్ చేయించుకోవాలి. ఒక సాధారణ బీపీ పరీక్షే జీవితాన్ని మార్చగలదన్నారు. నియంత్రణలో లేని హైపర్టెన్షన్ రక్తనాళాలను నెమ్మ దిగా దెబ్బతీస్తుంది. ఇది స్ట్రోక్, హార్ట్ ఫెయిల్యూర్, కిడ్నీఫెయిల్యూర్, వాస్క్యులర్ వ్యా ధుల వంటి ప్రాణాంతక సమస్యలకు ప్రమాదాన్ని పెంచుతుంది. భారతదేశంలో నివారిం చగల గుండె సంబంధిత మరణాలకు ఇది ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలుస్తోంది. జీవనశైలి మార్పులే మొదటి రక్షణగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ముందుగానే పరీక్షలు చేయించుకోవాలని, 30 ఏళ్ల తర్వాత సంవత్సరానికి ఒకసారి బీపీ చెక్ చేసుకోవాలన్నారు. ప్రివెంటివ్ కార్డియాక్ ఎటాక్‌పై కేర్ హాస్పిటల్స్ వివరించింది.



# నేపాలి గ్యాంగ్‌లో నలుగురి అరెస్టు

**మేడ్చల్, మే 17(ప్రజాక్షేత్రం):**

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని జవహర్‌నగర్ లోని వృద్ధ దంపతుల ఇంట్లో నేపాల్ ముఠా దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్‌మెట్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం కేసు వివరాలను సీపీ సుమతి వెల్లడించారు. కౌకూర్‌లోని మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివసించే అంతర్జాతీయ ఆర్బిట్రేటర్ మురళీ మోహన్ నర్సిపురం (68), తన భార్యతో కలిసి ఉంటున్నారు. వృద్ధ దంపతులు మాత్రమే ఒంటరిగా ఉంటున్నారనే విషయాన్ని గమనించిన రాజేష్, మీనా అనే నేపాల్ కార్మికులు.. దోపిడీకి వ్యూహం రచించారు. ఇందుకోసం సబీనా అలియాస్ సునీత, చాంగ్, సామ్రాట్, బిస్వాల్, కమల్, జంకర్ అలియాస్ శంకర్ అనే మరికొంతమంది నేపాల్ వ్యక్తులతో కలిసి పథకం వేశా రు. పథకం ప్రకారం మీనా అనే నిందితురాలు సబీనాను ఇంట్లో పనిమనిషిగా చేర్పించింది. రాజేష్‌ను ఆమె భర్తగా పరిచయం చే సింది. గత నెల ఏప్రిల్ 25 నుంచి సరైన సమయం కోసం వేచి చూసిన ఈ ముఠా, మే 11న సర్వెంట్ క్వార్టర్స్‌లో మీనా పుట్టినరోజు వేడుక పేరిట ఒక నాటకానికి తెరలేపింది. ఆ రాత్రి రాజేష్, సబీనా, మీనా, చాంగ్, సామ్రాట్ అనే ఐదుగురు నిందితులు ఇంట్లోకి ప్రవేశించగా, మిగిలిన నిందితులు బయట కాపలాగా ఉన్నారు. రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన నిందితులు వృద్ధ దంపతులను బంధించారు. వారికి బలవంతంగా మత్తు పదార్థాన్ని తినిపించి స్పృహ తప్పేలా చేశారు. అనంతరం ప్లాస్టిక్ టేపులు, గుడ్డలతో వారి కాళ్లు, చేతులు కట్టేసి, గడ్డపారలతో అల్మారాలను పగలగొట్టారు. ఇంట్లో ఉన్న సుమారు 60 తులాల బంగారు ఆభరణాలు, 15 కిలోల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్లు, 3,000 యూఎస్ డాలర్ల నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులను దోచుకెళ్లారు. ఘటన అనంతరం నిందితులు ఆటో, ద్విచక్ర వాహనాలపై పారిపోయారు. యాప్రాల్ సమీపంలో ద్విచక్ర వాహనం వదిలి, అక్కడి నుంచి రెండు టాక్సీలలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని దేశం దాటిపోయేందుకు ప్రయత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గతంలోనూ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక రాత్రి వేళ ఇళ్ల దొంగతనం కేసులో మీనా, రాజేష్లకు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో జరిపి న వేలిముద్రల పరీక్షలో మీనా వేలిముద్రలు సరిపోలాయి. నిందితులను పట్టుకునేందుకు మొత్తం 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బెంగళూరు, లక్నో, నేపాల్ సరిహద్దు ప్రాంతాలకు పంపించారు. దాదాపు 250కి పైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్రస్థాయి స మాచారంతో ఐదు రోజుల పాటు నిరంతరాయంగా శ్రమించి నిందితులను పట్టుకు న్నారు. శనివారం ఉదయం 10:45 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్‌లోని రేతిఫైల్ బస్ స్టేషన్ వద్ద నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో సునీత అలియాస్ సబీనా (28), బిస్వాల్ అలియాస్ విస్వాల్ (30), కమల్ బహదూర్ చలానే (34), జంకర్ బహదూర్ చలానే అలియాస్ శంకర్ (38) ఉన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# కనుమరుగవుతున్న చేతివృత్తులు...!

- **చేతివృత్తులలో మేదరి వృత్తి గొప్పది**
- **మేదరి చేసే వస్తువులు గ్రామీణ జీవనంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి**
- **ప్రభుత్వ ప్రోత్సహం లేక ఇబ్బందులు**





భారత దేశ జనాభాలో ఎనభై శాతం వ్యవసాయదారులే. వీరిలో వ్యవసాయదారులు, వ్యవసాయ సంబంధిత పనులలో పనిచేసే వారు ఉన్నారు. సాంప్రదాయ వ్యవసాయం రాను రాను యాంత్రీకరణం వైపు పరుగిడుతున్నది. కరువు ప్రాంతాల్లో వ్యవసాయం గిట్టు బాటు కాని వ్యవహారంగా తయారైనది. అటు వంటి ప్రాంతాలలో బక్క రైతులు వ్యవసాయం చేయలేక ఇతర వ్యాపకాలకు మళ్లుతున్నారు. పెద్ద రైతులు దైనందిన వ్యవసాయం పక్కన పెట్టి సావకాశంగా పనులు చేసుకునే.... నీరు తక్కువ అవసరం అయ్యే పండ్ల తోటలు వంటి వాటి పై మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగా పల్లెల్లో సామాజిక పరంగా, సాంస్కృతిక పరంగా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆప్యాయతకు, అనురాగానికి, ఆనందానికి, పల్లెలే పట్టు గొమ్మలు అనే మాటకు అర్థం లేకుండా పోతున్నది. పల్లెల్లో ఆలనాడు అనగా 1950 నుండి 1965 వరకు రైతులు, రైతు కూలీలు మొదలగు పల్లె వాసులు నివసించిన గృహాలు, పంటలు పండించే విధానము, వారు వాడిన పరికరాలు / పనిముట్లు రాను రాను కనుమరుగౌతున్నవి. వాటిని ఈ తరంవారు ప్రత్యక్షంగా చూడాలంటే అంత సులభంకాదు. ఏ పుస్తకాలలోనో, సినిమాలలోనో చూడ వలసిందే తప్ప వేరుమార్గం లేదు. ఆ పనిముట్లను, వాటిని వాడే విధానాన్ని, వాటి ఉపయోగాన్ని తెలియ జేయడమే ఈ వ్యాసం ఉద్దేశం. అంతే గాక ఆనాటి సామాజిక జీవన విధానము ఎలా వుండేది, పల్లె ప్రజలు ప్రతి విషయంలోను ఒకరికొకరు ఏవిధంగా సహకరించుకునేవారు, వారి అన్యోన్యత ఎలా ఉండేది, ప్రస్తుత పల్లెవాసుల జీవన విధానము ఎలా ఉన్నది, ఇలాంటి విషయాలన్నీ కూలంకషంగా పరిశీలించి, పరిశోధించి, ప్రత్యక్షంగా చూసి వ్రాసిన వ్యాసమిది. కాలానుగుణంగా ప్రాంతీయతను బట్టి కాస్తంత తేడా ఉండొచ్చు. అంతే గాని అన్ని విషయాలలోను తెలంగాణలో మొత్తంగా ప్రస్తుతమున్న పరిస్థితి ఇది. ఆ విషయాన్ని చెప్పేదే ఈ వ్యాసం. ఒక విధంగా ఈమార్పును పురోగమనమే అనవచ్చునేమో. రాజకీయంగా సాధారణ ప్రజలు చాలా చైతన్యం పొందారు. విద్యవిషయంలో ప్రజలు చాల పురోగతిని సాధించారు. సామాజికంగా కూడా కొంత అభివృద్ధి సాధించారు. దాని ప్రభావమే ఈ మార్పు.

సాంకేతిక పరమైన మార్పుల వలన కొత్త వస్తువులతో చేసే పని కొంత సులభమౌతుంది. మార్పు అంటే అదే. అటువంటి సాంకేతిక అభివృద్ధి నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఎవరో పనిగట్టుకొని సాధించే విజయం కాదిది. సామాజిక పరంగా జరిగే ప్రకృతి పరమైన అభివృద్దే ఇది. కాని సామాజికపరంగా జరిగే మార్పులు ..... అవి పురోగమన మనాలో తిరోగమన మనాలో అర్థంకాకున్నది. ఇదంతా సామజిక పరమైన అంశాల గురించి మాత్రమేనని గ్రహించాలి సాంకేతిక పరమైనవి కావు. ప్రతి వ్యక్తి తన జీవిత కాలంలో అతి స్పష్టంగా గ్రహించ గలిగే మార్పు ఇది. మార్పులు అతి వేగంగా జరుగుతున్న కాలమిది. ఉదాహరణకు చెప్పాలంటే ... అభివృద్ధి అనగా అది సాంకేతికమా, సామాజికమా ఏదైనా సరే ...మొదటి వంద సంవత్సరాలలో అంకశ్రేణి పద్ధతిలో పెరుగుతే, ఆదే అభివృద్ధి తర్వాత వంద సంవత్సరాలలో గుణశ్రేణి పద్ధతిలో అభివృద్ధి చెందింది. ఇది పరిశోధకులు నిరూపించిన సత్యం. కనుక ప్రతి సంవత్సరం మార్పులు చోటు చేసుకునే రోజులివి. అయా విషయాలు గతంలో ఎలా ఉండేవి ఇప్పుడెలా ఉన్నాయి వాటి మధ్య తారతమ్యాలేమిటి ఆవిషయాలను విషదేకించడం జరిగింది.

**మేదరి వృత్తి**

భారతదేశం అనేక సంప్రదాయ వృత్తులకు నిలయం. గ్రామీణ సంస్కృతిలో ప్రతి వృత్తి ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉంది. అలాంటి గొప్ప చేతివృత్తులలో మేదరి వృత్తి ఒకటి. మేదరి వారు పేదవారి కలపగా పిలవబడే వెదురుతో వివిధ రకాల గృహోపయోగ వస్తువులను తయారు చేసే కళాకారులు.వీరు తయారు చేసిన వస్తువులను వీధుల్లో తిరుగుతూ లేదా వార సంతల్లో విక్రయిస్తారు. వీరిని తెలుగు రాష్ట్రాల్లో మేదరి లేదా మహేంద్ర అనే పేరుతో పిలుస్తున్నారు.మరికొన్ని రాష్ట్రాల్లో మేధా,బురుడు ,గడబ అనే పేర్లతో పిలుస్తున్నారు.ఈ వృత్తి కేవలం జీవనోపాధి మాత్రమే కాదు ఒక సాంప్రదాయ కళా సంపద.మేదరులు ప్రకృతితో మమేకమై జీవించే వారు. అడవుల్లో లభించే వెదురు వారి జీవనాధారం. వెదురును సేకరించడం నుండి అది ఉపయోగకరమైన వస్తువుగా మారే వరకు అనేక దశలు ఉంటాయి. ఈ దశలన్నింటిలోనూ మేదరి వారి అనుభవం, శ్రమ, నైపుణ్యం ఉంటుంది.వీరు తయారు చేసే వస్తువులు గ్రామీణ జీవనంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి.వీరు గంపలు,బుట్టలు,చాటలు,సిబ్బులు,చంద్రికలు, పొనుకలు , విసనకర్రలు వంటి వస్తువులు తయారు చేస్తారు.ఇవి తయారు చేయడానికి ముందుగా అడవిలోంచి సరైన వెదురును ఎంచుకుంటారు. దానిని పగలగొట్టిన తర్వాత వెదురును పొడవుగా చీల్చి, పలుచని పేడుగా ,కర్రలు, ఓరలు, బిలుకులుగా అల్లకానికి తగినట్లుగా తయారు చేసుకుంటారు. మేదరి వృత్తి తరతరాలుగా వారసత్వంగా వస్తూ ఉంది.వీరి అల్లకం ఒక ప్రత్యేక కళా నైపుణ్యం.కాళ్ళు,చేతుల,వేళ్ళ చాకచక్యంతో, ఓపికతో, శ్రద్ధతో అల్లడం ద్వారా గంపలు, బుట్టలు చాటలు తయారు చేస్తారు.ప్రతి వస్తువు ఒక ప్రత్యేక రూపాన్ని కలిగి ఉంటుంది. గంపలు పెద్దవిగా, బుట్టలు తేలికగా, సిబ్బులు జల్లెడలు సమతలంగా ఉండేలా తయారు చేస్తారు.ఈ వృత్తిలో కేవలం శారీరక శ్రమ మాత్రమే కాకుండా కళాత్మక దృష్టి కూడా అవసరం. ఆకృతులు, నమూనాలు, ఆకర్షణీయమైన డిజైన్లు రూపొందించడం ద్వారా వస్తువులను అందంగా తయారు చేస్తారు. కొందరు మేదరి కళాకారులు తమ ప్రతిభతో కొత్త కొత్త నమూనాలను కూడా సృష్టిస్తున్నారు.ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యులందరూ పాల్గొంటారు. పురుషులు వెదురును పగలగొట్టడం, చీల్చడం వంటి పనులు చేస్తే, మహిళలు అల్లకం పనిలో నిపుణులు. పిల్లలు కూడా చిన్న చిన్న పనులు చేస్తూ ఈ కళను అభ్యసిస్తారు. తల్లిదండ్రుల నుండి పిల్లలకు ఈ కళ సంక్రమిస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలు ఈ వృత్తిని నేర్చుకుంటారు. అందువల్ల ఈ కళలో వారికి సహజమైన నైపుణ్యం ఏర్పడుతుంది. మేదరి మహేంద్రుల వృత్తి మన సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. వివాహాలు, పండుగలు, శుభకార్యాల్లో మేదరరులు తయారు చేసిన గంపలు, బుట్టలు ఉపయోగించడం ఒక ఆనవాయితీ.వెదురుకు ఆయుర్వేద గుణాలు ఉండడం వల్ల పుట్టినపుడు చాటలో వేస్తారు. పెళ్ళిళ్ళకు వెదురు తడకలతో పచ్చటి పందిరి వేయడం ఒక సాంప్రదాయం.మనిషి పుట్టినపట్టి నుండి చనిపోయినపుడు తీసుకెళ్లే ఏడు కట్ల పాడె సవారీ వరకు వెదురు అవసరం. కావున వెదురులు,మేదరులు సమాజంతో ముడివేసుకున్న తీరును మనము అర్థం చేసుకోవచ్చు. ఆధునిక కాలంలో ఈ వృత్తి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది.గత కాలంలో ప్రతి ఇంటిలోనూ, వ్యవసాయంలోనూ మేదరులు తయారు చేసిన వస్తువులే ఉపయోగించేవారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వీరి పాత్ర చాలా కీలకమైనది. కానీ కాలక్రమేణా పరిశ్రమల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల ప్లాస్టిక్, ఇనుము, యంత్రాలతో తయారైన వస్తువులు మార్కెట్‌లోకి వచ్చాయి. ఇవి తక్కువ ధరలకు, ఎక్కువ కాలం నిలిచేలా ఉండటంతో ప్రజలు వాటిని ఎక్కువగా వినియోగించడం ప్రారంభించారు. దీంతో మేదరి వృత్తికి డిమాండ్ తగ్గిపోయింది.మరొక ప్రధాన సమస్య వెదురు లభ్యత తగ్గిపోవడం. అడవుల తగ్గుదల, అటవీ చట్టాల పరిమితుల కారణంగా మేదరులు వెదురును సులభంగా సేకరించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు వారి జీవనోపాధిని మరింత క్లిష్టంగా మార్చాయి.

ఇలాంటి పరిస్థితుల్లో ఈ వృత్తి ఆదాయం తక్కువగా ఉండడంతో చాలామంది ఇతర పనులవైపు వెళ్లుతున్నారు. కొందరు కూలీ పనులు, మరికొందరు పూలు అమ్మడం, డెకరేషన్ లాంటి పనులు ఇంకొంతమంది చిన్న చిన్న వ్యాపారాలు చేపడుతున్నారు. యువత కూడా ఈ వృత్తిపై ఆసక్తి చూపకపోవడం వల్ల ఈ సంప్రదాయ వృత్తి క్రమంగా తగ్గిపోతోంది. నవ కల్పనలు చేయడం, ప్రభుత్వ చొరవ వల్ల వెదురు ఉత్పత్తి, వాడకం కూడా పెంచవచ్చు.

వెదురుతో తయారు చేసిన వస్తువులు వాడడం సమాజం బాధ్యత. ఇందుకు ప్రభుత్వ సహకారం, ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. హస్తకళల ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా వెదురు వస్తువులను ప్రోత్సహించవచ్చు. ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే వారి ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తుంది.మేదరి కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా కొత్త డిజైన్లు, ఆధునిక పద్ధతులు నేర్పవచ్చు. బ్యాంకుల ద్వారా రుణాలు, సబ్సిడీలు అందిస్తే వారు ఆర్థికంగా బలపడతారు.వెదురు వాడడం వల్ల పర్యావరణాన్ని కాపాడుతూ సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయవచ్చు



ఎం. రవీందర్
సీనియర్ జర్నలిస్ట్

# 'ఐక్య' సంస్థ ప్రారంభం వెనుక ఉద్దేశం ఇదే: మంచు మనోజ్, మౌనిక

- **'ఐక్య ధైర్య సేన సమితి'ని ప్రారంభించిన మంచు మనోజ్, మౌనిక**
- **సేవా భావం ఉన్నవారందరినీ ఒకే వేదికపైకి తేవడమే లక్ష్యమన్న మనోజ్**
- **మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై కూడా దృష్టి సారిస్తామన్న మౌనిక**
- **ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరించిన మనోజ్ దంపతులు**
- **కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**





**హైదరాబాద్ మే 17(ప్రజాక్షేత్రం):**

సమాజానికి సేవ చేయాలనే బలమైన ఆలోచన ఉన్న ప్రతీ ఒక్కరినీ ఒకే గొడుగు కిందకు తేవాలనే గొప్ప లక్ష్యంతోనే ఐక్య సంస్థను ప్రారంభించినట్టు నటుడు 'రా కింగ్' మంచు మనోజ్, ఆయన భార్య మౌనిక భూమా వెల్లడించారు. తన పుట్టిన రోజు నేపథ్యంలో, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో "ఐక్య ధైర్య సేన సమితి" అనే తమ సామాజిక సేవా సంస్థను మనోజ్ అధికారికంగా ఆవిష్కరించారు. సేవా భావం ఉన్నవారందరికీ ఒక వేదికను అందించాలనేదే తమ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం గురించి మనోజ్ భావోద్వేగంగా మాట్లాడుతూ, "సమాజానికి అండగా నిలబడటం నేను, నా భార్య మౌనిక మా పెద్దల నుంచి నేర్చుకున్నాం. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినా, ఒకే ఆలోచన ఉన్న వారందరి కోసం ఒక వేదిక ఉండాలనిపించింది. ఈ ఆలోచన నిజానికి నా భార్య మౌనికది. ఆమె స్ఫూర్తితోనే ఈ సంస్థను ప్రారంభిస్తున్నాం. దీని ద్వారా ఎవరికి నిజమైన సహాయం అందినా అదే మాకు గొప్ప విజయం" అని తెలిపారు. ఈ రోజు నుంచే ఐదుగురు పిల్లల విద్యా బాధ్యతలను స్వీకరిస్తున్నామని, ఈ సేవలను రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ గ్రామానికి విస్తరిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం మౌనిక భూమా మంచు మాట్లాడుతూ, "మంచి ఉద్దేశంతో నేను, మనోజ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఇది మా తల్లిదండ్రుల ఆశీర్వాదాల వల్లే సాధ్యమైంది. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానంతో పాటు మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెడతాం. 'నమస్తే వరల్డ్' సంస్థ ద్వారా టాయ్ మేకింగ్ వంటి కోర్సులతో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, "ఐక్య ధైర్య సేన సమితి" పేరును అధికారికంగా ప్రకటించారు. మనోజ్ కుటుంబంతో తమకు మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, చిన్నప్పటి నుంచే మనోజ్‌లో సేవా భావం ఉందని కొనియాడారు. మౌనిక ఆలోచనతో పుట్టినరోజున ఈ ట్రస్ట్ ప్రారంభించడం అభినందనీయమని, ఈ కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఒకవైపు 'డేవిడ్ రెడ్డి' వంటి భారీ చిత్రాలతో నటుడిగా బిజీగా ఉంటూనే, మరోవైపు 'ఐక్య ధైర్య సేన సమితి' ద్వారా సమాజ సేవకు అంకితం కావడం పట్ల మనోజ్ దంపతులపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సినిమాలు, సమాజ సేవ అనే రెండు మార్గాల్లో మనోజ్ తన ప్రయాణాన్ని బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

## డైలాగ్స్ లేకుండా హావభావాలు పలికించడం ఛాలెంజింగ్‌గా అనిపించింది



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ జ్యోతిక, ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. ఓవైపు సినిమాలుచేస్తూనే వెబ్‌సిరీస్‌లలో తన సత్తా చాటుతోంది. బాలీవుడ్‌లోనూ అదరగొడుతున్న నటి జ్యోతిక.. అమెజాన్ ప్రైమ్ వీడియో ఒరిజినల్ చిత్రం 'సిస్టమ్' మూవీతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారి తెరకెక్కిస్తున్న ఈ కోర్ట్‌రూమ్ థ్రిల్లర్ సినిమాలో జ్యోతిక, సోనాక్షి సిన్హా, అశుతోష్ గోవారికర్ కీలక పాత్రలో నటించారు. అయితే ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పలు విశేషాలతో పాటు తన పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. "సారికా రావత్ పాత్ర చాలా ఎమోషనల్ అండ్ పవర్‌ఫుల్. ఆమె కోర్టులో జరిగే ప్రతి విషయాన్ని నిశితంగా గమనిస్తూ, నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోతుంది. అదే సమయంలో ఒక తల్లిగా ఇల్లు, ఉద్యోగాన్ని బ్యాలెన్స్ చేసే సాధారణ మహిళ పాత్ర ఇది. ఈ సినిమాలో డైలాగ్స్ కంటే సైలెన్స్‌తోనే ఎక్కువ హావభావాలు పలికించాల్సి వచ్చింది. ఇది నాకు చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది" అని చెప్పారు. హిందీ ఇండస్ట్రీలో నలభై ఏళ్లు దాటిన మహిళా నటీమణుల కోసం వైవిధ్యమైన, లోతైన పాత్రలు రాయడం పట్ల జ్యోతిక సంతోషం వ్యక్తం చేశారు. సౌత్ సినిమాలకు, హిందీ కంటెంట్‌కు మధ్య ఉన్న తేడా వివరిస్తూ.. "సౌత్ సినిమాలు థియేటర్లలో అద్భుతంగా ఆడుతున్నాయి, అక్కడ నటించడం నాకు ఎప్పుడూ ఇష్టమే. కానీ అక్కడ చాలా పాత్రలు ఇప్పటికీ పురుషుల కోణంలోనే రాయబడుతున్నాయి. అయితే హిందీలో, ముఖ్యంగా ఓటీటీ పుణ్యమా అని మహిళల పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ, విభిన్న కోణాల్లో కథలను అల్లుతున్నారు" అని జ్యోతిక అభిప్రాయపడ్డారు.

## నా అభిమానులు నన్ను అర్థం చేసుకుంటారనే నమ్మకం నాకుంది..



కన్నడ స్టార్ యష్ హీరోగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్'. యష్ స్వయంగా కథ అందించిన ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ పూర్తి కాగా.. రెండుసార్లు విడుదల వాయిదా పడటంతో యష్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. తాజాగా, ఈ విషయంపై హీరో యష్ ఓ ఇంటర్వ్యూలో భాగంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ.. ఇటీవల 'సినిమాకాన్'లో ఈ చిత్రానికి వచ్చిన అద్భుతమైన గ్లోబల్ రెస్పాన్స్ చూశాక, దీనిని అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలనే ఉద్దేశంతో రెండోసారి వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

ఈ విషయంపై యష్ మాట్లాడుతూ.. "ఈ సినిమా రిలీజ్‌కు మరికొంత సమయం తీసుకోవాలని నేను నిర్ణయించుకున్నాను. ఈ నిర్ణయం నా అభిమానులకు, భారతీయ ప్రేక్షకులకు నచ్చదనే విషయం నాకు తెలుసు. ఎందుకంటే ఇక్కడ ఒకసారి షూటింగ్ మొదలైతే, ఒక నిర్దిష్ట సమయంలో సినిమా రావాలని ప్రేక్షకులు అనుకుంటారు. కానీ పాశ్చాత్య దేశాలలో మూవీ పూర్తిగా పూర్తయిన తర్వాతే బిజినెస్, మార్కెటింగ్ మొదలవుతుంది. భారీ బడ్జెట్ ఇన్వాల్వ్ అయి ఉండటం వల్ల గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్, అంతర్జాతీయ భాగస్వామ్యాల కోసమే మేము సమయం తీసుకుంటున్నాము. నా అభిమానులు నన్ను అర్థం చేసుకుంటారనే నమ్మకం నాకుంది" అని తెలిపారు.

## అందుకే స్క్రిప్ట్ చదవను

నా జీవితంలో స్క్రిప్ట్ రాశాను కానీ, ఎప్పుడూ చదవలేదంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. తాను సినిమా స్క్రిప్‌ట్‌ని వినే విధానం గురించి ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ''నేను స్క్రిప్ట్ వింటాను. ఎందుకంటే నాకొక సమస్య ఉంది. దానిని చదవడం మొదలు పెట్టినప్పుడు మూడో లైన్ చదువుతుంటే నా మనసు అయిదవ లైన్ మీద ఉంటుంది. అందుకే రచయిత లేదా దర్శకుడి నుంచి ఆ స్క్రిప్ట్ వినడానికి ఇష్టపడతాను. అప్పుడు అతను ఎలాంటి సినిమా తీయాలని అనుకుంటున్నాడో చెబుతున్నప్పుడూ.. తన విజన్ ఏంటో నాకు తెలుస్తుంది. అలా కాకుండా నేను స్క్రిప్ట్ చదవడం ప్రారంభిస్తే ఆ సినిమాను ఎలా తీస్తానో అనే దానిపై నా దృష్టంతా మళ్లిపోతుంది. అందులోనూ మళ్లీ నా విజన్ దర్శకరచయితల విజన్‌కు భిన్నంగా ఉంటుంద''ని అన్నారు. 'బాఘీ', 'వీర్', 'దబాంగ్ 3' చిత్రాలలో ప్రధాన పాత్రల్లో నటించడంతోపాటు సల్మాన్ రచయితగానూ పనిచేశారు. సల్మాన్ 'మాతృభూమి' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



## రజనీతో పోటీ ఉంటుంది కానీ, అసూయ ఎందుకుంటుంది



రజనీకాంత్, తాను వెండితెరపై ఒకరితో ఒకరు పోటీపడతామే తప్ప, తమ మధ్య అసూయ అనేది లేదని ప్రముఖ నటుడు, ఎంపీ కమల్ హాసన్ స్పష్టం చేశారు. విజయ్ సీఎం అయితే, తానెందుకు అసూయపడతానని, ఒకవేళ కమల్‌హాసన్ సీఎం అయి ఉంటే అసూయ పడేవాడినని రజనీకాంత్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ విషయమై విలేకరులు కమల్‌హాసన్‌ను ప్రశ్నించగా, ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తామిద్దరం ఇరవై ఏళ్ల వయసులోనే ఒకరిపై ఒకరు ఎలాంటి విమర్శలు చేసుకోకూడదని నిర్ణయించుకున్నామని తెలిపారు. వేర్వేరు పంథాల్లో సాగుతూ ఆరోగ్యకరమైన పోటీతోనే రాణిస్తున్నామని అన్నారు. ''కమల్ సీఎం అయితే, అసూయపడతా'నని రజనీకాంత్ నవ్వుతూ చెప్పారు. మేం ఒకరితో ఒకరం పోటీ పడతాం కానీ అసూయ ఎందుకు పడతాం. మేము సినీ రంగంలో ఉన్నాం. క్రికెట్లో ఉన్నా ఇలాగే ఉండేవాళ్లం'' అని కమల్‌హాసన్ అన్నారు. సీఎం విజయ్‌ను కలిసిన సందర్భంగా ఇచ్చిన వినతి పత్రంలో కీలక అంశాలు ఏంటి? అని అడగ్గా, 'మీరు చదివి కూడా చూడలేదన్నట్లు అడుగుతున్నారు. వాటిని మీ మిత్రులే రాశారు. మళ్లీ మళ్లీ దాని గురించి మాట్లాడుకోవద్దు. వినతిపత్రంలోని అంశాల్లో కీలకం ఏదో దానిని అండర్‌లైన్ చేసి చూపించడం మీ బాధ్యత' అని సమాధానమిచ్చారు.

'సీఎం అయ్యాక విజయ్‌ను అన్ని రాజకీయ పార్టీల నాయకులను వెళ్లి కలిశారు. అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని కలవకపోవడం చర్చనీయాంశంగా మారింది. అన్నాడీఎంకే చీలికవర్గంలోని 25 మంది ఎమ్మెల్యేలు విజయ్ వెంట వెళ్లేలా ఉన్నారని అంటున్నారు. ఈ పరిస్థితులను మీరు ఎలా చూస్తున్నారు' అని మరో విలేకరి అడగ్గా, 'మీలాగే చూస్తున్నాను. చోద్యం చూస్తున్నా' అంటూ కమల్ కాస్త ఘాటుగానే స్పందించారు.

## ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లైనా నా కోరిక తీరలేదు

చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుని, ఆ తర్వాత 'ఉయ్యాల జంపాల' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది అవికా గోర్. తెలుగులో పలు చిత్రాల్లో నటించి మెప్పించిన ఈ ముద్దుగుమ్మ, త్వరలోనే విడుదల కాబోతున్న 'అగ్లీ స్టోరీ' అనే సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అవికా గోర్ తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చేసిన కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా చర్చనీయాంశంగా మారాయి. సినిమాల్లో తన ప్రయాణం గురించి అవికా మాట్లాడుతూ.. "నేను ఇప్పటివరకు ఎన్నో సినిమాలు, విభిన్నమైన పాత్రలు చేశాను. కానీ ఒక నటిగా నాకు పూర్తిగా ఆత్మసంతృప్తిని కలిగించే ఒక డ్రీమ్ రోల్‌ను మాత్రం ఇప్పటివరకు చేయలేకపోవడంతో నా కోరిక తిరలేదు. ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లైనా నా మనసుకు నచ్చిన, ఛాలెంజింగ్‌గా ఉండే ఆ ఒక్క పాత్ర కోసం నేను ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నాను. నా లైఫ్‌లో అదొక చిన్న బాధగా మిగిలిపోయింది" అంటూ తన ఆవేదనను పంచుకుంది. ఇక తన వ్యక్తిగత జీవితం, పెళ్లి గురించి అవికా ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టింది.

"నేను మిలింద్ దాదాపు ఏడేళ్ల పాటు ప్రేమించుకున్నాం. ఆ తర్వాత మా ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. అయితే మొదట్లో మా పేరెంట్స్ ఈ పెళ్లి విషయంలో కొంచెం సందేహపడ్డారు. కానీ ఆ తర్వాత మా ప్రేమను, మమ్మల్ని అర్థం చేసుకుని సంతోషంగా మా పెళ్లికి ఒప్పుకున్నారు" అని అవికా చెప్పింది. పెళ్లి తర్వాత తన లైఫ్ ఎలా ఉందనే విషయంపై స్పందిస్తూ.. వివాహ బంధంలోకి అడుగుపెట్టాక తన జీవితం చాలా సంతోషంగా సాగుతోందని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేదా సమస్యలు ఎదురుకాలేదని స్పష్టం చేసింది. తామిద్దరం ఒకరినొకరు చాలా బాగా అర్థం చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగుతున్నామని పేర్కొంది. అలాగే పెళ్లి తర్వాత తన జీవితంలో కొన్ని మార్పులు వచ్చిన మాట వాస్తవమేనని, అయితే ఆ మార్పులన్నీ చాలా పాజిటివ్‌గా ఉన్నాయని అవికా గోర్ ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.




## బాలయ్యా డబుల్ ట్రీట్!



రెబల్ స్టార్ ప్రభాస్, ప్రశాంత్ నీల్ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న సలార్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నది. ఇదిలా ఉంటే ఈ మూవీకి సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. సలార్ మూవీకి సంబంధించిన టీమ్ ఎవరూ మీడియా ముందుకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో యూనిట్ సభ్యులు మీడియా ముందుకు వచ్చి సినిమా విశేషాలను వెల్లడిస్తూ అంచనాలు పెంచుతారని అంతా భావించారు. కానీ చిత్ర యూనిట్ మాత్రం అనూహ్యంగా కఠిన నిర్ణయం తీసుకున్నది. ట్రైలర్ రిలీజ్ అయ్యే వరకు చిత్ర యూనిట్ సభ్యుల్లో ఏ ఒక్కరు మీడియా ముందుకు వెళ్లకూడదని కండీషన్ పెట్టారు. హీరో, దర్శకుడు, హీరోయిన్ ఇలా ప్రతి ఒక్కరు కూడా మీడియా ముందుకు వచ్చి సలార్ పై మాట్లాడొద్దని రూల్ పెట్టారు.

## కేన్స్‌లో హ్యూమా సందడి

'టాక్సిక్'తో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషీ. వైవిధ్యమైన కథలతో ప్రయాణం చేసే ఈమె.. తాజాగా ప్రతిష్ఠాత్మక కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసింది. ఇటీవలే ఈ ఫిల్మ్స్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లో వైభవంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. పలువురు భారతీయ సినీతారలు ఈ వేదికపై సందడి చేస్తుండగా.. హ్యూమా కూడా ఈ చిత్రోత్సవాల్లో అడుగుపెట్టి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ వేడుకలో బనారసి చీర కట్టులో కనిపించి.. ఆకట్టుకునే అందంతో ప్రపంచ వేదికపై భారతీయ వారసత్వాన్ని చాటి చెప్పింది హ్యూమా.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048.
Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com